

అభివృద్ధితోనే అడుగులు



నగరి ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్

ఏడాదిలో 1 ఏం చేశారు?

ఆచితూచి అడుగు వేస్తారు. తడుముకోరు. తడబాటు ఉండదు. క్లుప్తంగా, సూటిగా, స్పష్టంగా మాట్లాడతారు. నగరి ఎమ్మెల్యేగా గెలిచిన తొలి ఏడాదిలోనే తండ్రికి తగ్గ తనయుడు అనిపించుకున్నారు గాలి భానుప్రకాష్. రాజకీయాల్లో ధక్కాముక్కీలు తిన్న కుటుంబానికి వారసుడిగా తొలి ఓటమిని ఎదుర్కొన్న గాలి భానుప్రకాష్ 2024లో గెలుపును సొంతం చేసుకున్నారు. ఫైర్‌బ్రాండ్ రోజా నోటినీ, ఆమె వర్గం రాజకీయ వ్యూహాలనూ సమర్థంగా ఎదుర్కొంటూ ఆరితేరారు. అలివిగాని మాటలు చెప్పరుగానీ, చెప్పినవన్నీ చేస్తారన్న పేరును మాత్రం జనంలో తెచ్చుకున్నారు. తొలి ఏడాది కాలంలో నగరి ఎమ్మెల్యేగా గాలి భానుప్రకాష్ ఏం సాధించారు? ఇంకా ఏమి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. సీఎం దృష్టికి ఆయన తీసుకువెళ్లిన అంశాలేమిటి.. వీటిపై గాలి భానుప్రకాష్‌తో ఆంధ్రజ్యోతి సంభాషణలోని ముఖ్యాంశాలు...

- 4వ పేజీలో -

మణీంద్రం ఎంపీటీసీకి మూడు నామినేషన్లు

ఉద్రిక్తంగా సాగిన ప్రక్రియ

రామకుప్పం, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): రామకుప్పం మండలం మణీంద్రం ఎంపీటీసీ ఉప ఎన్నికల నామినేషన్ల దాఖలు ప్రక్రియ ఉద్రిక్తతల మధ్య శుక్రవారం ముగిసింది.మొత్తం మూడు నామినేషన్లు దాఖలైనట్టు ఎన్నికల అధికారి లక్ష్మీకాంత్ తెలిపారు. గురువారం టీడీపీ అభ్యర్థులుగా అత్తికుప్పానికి చెందిన ఐటీడీపీ పార్లమెంటరీ కార్యనిర్వాహక కార్యదర్శి జ్ఞానశేఖర్‌రెడ్డి భార్య అరుణ, మణీంద్రం గ్రామానికి చెందిన పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు శ్రీరాములురెడ్డి భార్య విశాలాక్షి, వైసీపీ అభ్యర్థిగా ఆకందగానిపల్లెకు చెందిన ఆ పార్టీ మండల కో-కన్వీనర్ చంద్రారెడ్డి కుమార్తె అర్పిత నామినేషన్ పత్రాలను ఎన్నికల అధికారి లక్ష్మీకాంత్‌కు అందజేశారు. అరుణ శుక్రవారం మరో రెండు సెట్ల నామినేషన్లను దాఖలు చేశారు. శుక్రవారం టీడీపీ శ్రేణులు నామినేషన్లు దాఖలవుతున్న మండల సచివాలయం నలుదిక్కులా మోహరించారు. మధ్యాహ్నం 12.30గంటల ప్రాంతంలో ఆకందగానిపల్లెకు చెందిన శ్రీదేవి తన భర్త కుమార్‌రెడ్డి, కుమార్తె శిల్ప, మరో మహిళ రాణితో కలిసి స్వతంత్ర అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేసేందుకు వచ్చారు. వైసీపీ తరపున నామినేషన్ దాఖలు చేసిన అర్పితకు శ్రీదేవి పిన్నమ్మ కావడంతో టీడీపీ శ్రేణులు వారిని అడ్డుకుని వెనక్కి పంపేశారు. సాయంత్రం 4గంటల ప్రాంతంలో శ్రీదేవి మరోసారి రాణితో కలిసి నామినేషన్ వేసేందుకు అక్కడకు వచ్చారు. ఈ సమయంలో అక్కడ తోపులాటలు జరిగాయి.ఘర్షణ వాతావరణం చోటు చేసుకుంది. ఇక సింగసముద్రానికి చెందిన గీతను కాంగ్రెస్ అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేయించేందుకు డీసీసీ అధ్యక్షుడు పోటుగారి భాస్కర్, కాంగ్రెస్ కుప్పం నియోజకవర్గ ఇన్‌చార్జి ఆవుల గోపీతో పాటూ రెండు కార్లలో మండల సచివాలయం వద్దకు వస్తుండగా కొందరు అడ్డుకున్నారు.కార్లపైకి దూసుకు పోయారు. కార్ల అద్దాలు పాక్షికంగా పగిలాయి.దీంతో భయపడ్డ గీత దంపతులు అక్కడినుంచి వెళ్లి పోయారు.



అద్దాలు పగిలిన కారు

నేడు నామినేషన్ల పరిశీలన

శనివారం నామినేషన్ల పరిశీలన ఉంటుందని ఎన్నికల అధికారి తెలిపారు. ఆదివారం నామినేషన్ల తిరస్కరణపై అప్పీళ్ళు సోమవారం అప్పీళ్ళ పరిశీలన ఉంటుందన్నారు. మంగళవారం మధ్యాహ్నం 3గంటల వరకు నామినేషన్ల ఉపసంహరణకు అవకాశముందన్నారు. 3గంటల అనంతరం పోటీలో ఉన్న అభ్యర్థుల జాబితా ప్రకటిస్తామన్నారు.ఈనెల 12న పోలింగ్, అవసరమయితే 13న రీపోలింగ్ నిర్వహిస్తామన్నారు.14న ఉదయం 8గంటలకు ఓట్ల లెక్కింపు ప్రారంభించి పూర్తయిన అనంతరం ఫలితాన్ని ప్రకటించనున్నట్టు ఆయన తెలిపారు.

భక్తుల సేవకు స్వచ్ఛంద సేవకులు కావాలి

కాణిపాక ఆలయ ఈవో కిషోర్

ఐరాల(కాణిపాకం), ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ పుణ్యక్షేత్రమైన కాణిపాక వరసిద్ధి వినాయక స్వామి ఆలయంలో భక్తులకు ఎలాంటి అసౌకర్యం కల్గకుండా చూడటానికి స్వచ్ఛంద సేవకులు కావాలని ఈవో పెంచలకిషోర్ కోరారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ.. ఆలయానికి విచ్చేస్తున్న భక్తుల సంఖ్య రోజురోజుకూ పెరుగుతోందన్నారు. దీనివల్ల క్యూలైన్లలో భక్తులు ఇబ్బందులు పడకుండా టీటీడీ తరహాలో స్వచ్ఛంద సేవకుల అవసరం ఉందన్నారు. సేవకు విచ్చేసే వారు క్యూలైన్ల నిర్వహణతోపాటు భక్తులకు తాగునీరు అందించడం, ఉచిత ప్రసాద పంపిణీ, అన్నదాన కేంద్రంలో అన్నప్రసాదాల వితరణ వంటి పనులు చేయాల్సి ఉంటుందని చెప్పారు. సేవా దృక్పథంతో విచ్చేసే స్వచ్ఛంద సేవకులకు ఆలయం తరఫున భోజన వసతి, బస సౌకర్యాన్ని కల్పిస్తామని ఈవో తెలిపారు. ఆసక్తిగలవారు https://srikanipakadevasthanam.org/ ద్వారా ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

అన్నదాతా సుఖీభవ!

2,05లక్షలమంది రైతుల ఖాతాల్లో నేడు రూ.7వేల చొప్పున నగదు జమ

చిత్తూరు సెంట్రల్, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి):ఎన్నికల సందర్భంగా టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు హామీ ఇచ్చిన 'సూపర్ సిక్స్' హామీల్లో ఒకటైన 'అన్నదాత సుఖీభవ' పథకం శనివారం అమల్లోకి రానుంది.అన్నదాతలకు ప్రోత్సాహకంగా కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు పీఎం కిసాన్ యోజన,అన్నదాత సుఖీభవ పథకాల కింద ఒక్కో రైతుకు రూ.7వేల చొప్పున వారివారి బ్యాంకు ఖాతాల్లో జమ చేయనున్నాయి.వైసీపీ హయాంలో రూ.13,500 (రాష్ట్రం వాటా రూ.7500, కేంద్ర వాటా రూ.6500) మాత్రమే రైతు భరోసా కింద ఇచ్చేవారు.కూటమి ప్రభుత్వం మరో రూ.6,500 పెంచి మొత్తంగా రూ.20వేలు ఇవ్వనుంది. ఇందులో రాష్ట్ర వాటా రూ.14వేలు కాగా, కేంద్ర వాటా కింద రూ.6వేలు రైతుల ఖాతాల్లో జమచేయనున్నారు. గతంలో మాదిరిగానే మూడు విడతల్లో ఈ సొమ్ము రైతుల బ్యాంకు ఖాతాల్లో జమకానుంది. ఏప్రిల్-జూలై వరకు మొదటి విడత, ఆగస్టు-నవంబరు వరకు రెండో విడత, డిసెంబరు-మార్చి వరకు మూడో విడతగా విభజించారు.రాష్ట్ర ప్రభుత్వం మొదటి విడత రూ.5వేలు, రెండో విడతలో రూ.5వేలు, మూడో విడతలో రూ.4వేలు ఇవ్వనుండగా, కేంద్ర ప్రభుత్వం ఒక్కో విడతలో రూ.2వేల చొప్పున ఇవ్వనుంది.వ్యవసాయ శాఖ లెక్కల ప్రకారం జిల్లాలో 2,11,628మంది రైతులుండగా, వీరిలో 2,05,753 మంది రైతుల ఈకేవైసీ పూర్తయింది. 5875 మంది రైతుల ఈకేవైసీ తిరస్కరణకు గురవడంతో మరోసారి వీరి ఈకేవైసీ పరిశీలన చేయాల్సి ఉంది. దీంతో అర్హత సాధించిన 2.05 లక్షల మంది రైతులకు అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్ పథకాల నిధులు రూ.138.16 కోట్లు వారి బ్యాంకు ఖాతాల్లో శనివారం జమకానున్నాయి.ఇందులో రాష్ట్ర ప్రభుత్వ వాటా కింద రూ.102.88 కోట్లు , కేంద్ర ప్రభుత్వ వాటా కింద రూ.35.28 కోట్ల నిధులున్నాయి.



ద్రావిడ భాషా సాహిత్య కల్పతరువు!

అమెరికాలో కన్ను మూసిన ప్రొఫెసర్ గంగిశెట్టి లక్ష్మీనారాయణ ● ఆయన సాహిత్య సేవలు అనన్యం



కుప్పం, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): ద్రావిడ విశ్వవిద్యాలయం మాజీ వీసీ గంగిశెట్టి లక్ష్మీనారాయణ మరణం సాహిత్య వర్గాలను శోకసముద్రంలో ముంచెత్తింది. శుక్రవారం అమెరికాలో తన కుమారుడి ఇంట్లో 78 ఏళ్ల వయసులో ఆయన కన్ను మూశారు. మారుమూల కుప్పంలో మరుగున ఉండిపోయిన ద్రావిడ విశ్వవిద్యాలయాన్ని ఎనలేనంతగా అభివృద్ధి చేసి, ద్రావిడ భాషా రాష్ట్రాల పర్యంతం పేరుగల వర్సిటీగా నిలబెట్టిన ఘనత ఆచార్య గంగిశెట్టి లక్ష్మీనారాయణకే దక్కుతుంది. ద్రావిడ భాషా సాహిత్యాలకు, ద్రావిడ విశ్వవిద్యాలయం అభివృద్ధికి ఆయన చేసిన కృషిని ఈ సందర్భంగా సాహిత్య వర్గాలు మననం చేసుకుంటున్నాయి.

తెలుగు వెలుగు నందమూరి తారక రామారావు మానస పుత్రికగా ద్రావిడ విశ్వవిద్యాలయం 1997లో స్థాపితమైంది.ఏర్పడనైతే ఏర్పడింది కానీ,అప్పటి విశ్వవిద్యాలయంలో కేవలం హిస్టరీ, ఫిలాసఫీ, జానపద గిరిజన అధ్యయన శాఖలు మాత్రమే ఉండేవి. ఈ దశలో 2005 ఆగస్టు 8న ప్రొఫెసర్ గంగిశెట్టి లక్ష్మీనారాయణ ద్రావిడ విశ్వవిద్యాలయం 3వ ఉప కులపతిగా బాధ్యతలు తీసుకున్నారు. 2008 ఆగస్టు 4న పదవీ విరమణ చేసేదాకా ద్రావిడ వర్సిటీకి స్వర్ణయుగమే నడిచిందని చెప్పవచ్చు. ద్రావిడ భాషలైన తెలుగు, తమిళ, కన్నడ, మలయాళ, తుళులతోపాటు వీటిని అనుసంధానించడానికి ఆంగ్ల అధ్యయన శాఖలను ఆయన ప్రారంభించారు. ఆయా భాషా శాస్త్రాల్లో నిష్ణాతులైన సీనియర్ ఆచార్యులను ఎంపిక చేసి కోరి మరీ నియమించుకున్నారు. మరోవైపు యూనివర్సిటీ తరఫున ప్రసారాంగ పేరుతో ప్రచురణల సంస్థను స్థాపించి ద్రావిడ భాషల్లో ప్రసిద్ధులైన రచయితల రచనలను ముద్రించారు. దీన్ని క్రియాశీలకంగా పనిచేయించడానికి 18 పోస్టులు సృష్టించారు. ఆయా భాషల్లో మాత్రమే అయితే కేవలం ఆ భాషా పాఠకులకు మాత్రమే పరిమితం అవుతుందని భావించి, ఒక భాషనుంచి ఇంకో భాషకు అనువాదం చేసేందుకు ప్రసారాంగకు అనుబంధంగా అనుసృజన పేరుతో అనువాద శాఖను నెలకొల్పారు. ఈ శాఖకు ప్రఖ్యాత కవి దివంగత వేగుంట మోహన్ ప్రసాద్‌ను ఒప్పించి డైరెక్టర్‌గా నియమించారు. గంగిశెట్టి లక్ష్మీనారాయణ హయాంలో ప్రసారంగ, దానికి అనుబంధమైన అనుసృజన శాఖలు అనేక ప్రసిద్ధ ప్రచురణలు, అనువాదాలతో ఒక వెలుగు వెలిగాయి. కందుకూరి వీరేశలింగం నవల రాజశేఖర చరిత్రము తెలుగునుంచి వివిధ ద్రావిడ భాషలకు అనువాదం చేయడం అప్పుడే జరిగింది. అంతేకాదు, తెలుగువాళ్లు గర్వించే రచయిత రాచకొండ విశ్వనాథ శాస్త్రి రచనలు కూడా ద్రావిడ భాషలకు అప్పుడే అనువాదమయ్యాయి. సంజీవదేవ్ హస్త రేఖలు నవలను సైతం వివిధ భాషల్లోకి అనువదించారు. తిరుమల రామచంద్ర ఆత్మకథ 'హంపీ నుంచి హరప్పా దాక' తెలుగు నుంచి ఇతర ద్రావిడ భాషల్లోకి గంగిశెట్టి లక్ష్మీనారాయణే అనువాదం చేయించారు.జ్ఞానపీఠ అవార్డు గ్రహీత అయిన కన్నడ రచయిత ఎస్.ఎల్.భైరప్ప 'పర్వ' నవల సైతం ఆ భాషనుంచి సాటి ద్రావిడ భాషల్లోకి లక్ష్మీనారాయణచే అనువదించబడి ఆయా భాషల్లోని సాహిత్యాభిమానులను అలరించింది. 2004లో ఈ అనువాదానికి కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు లభించింది.గంగిశెట్టి లక్ష్మీనారాయణ ద్రావిడ భాషా సంస్కృతులకు సంబంధించిన అనేక వ్యాసాలు, రచనలు చేశారు. పలు ద్రావిడ భాషలకు చెందిన ప్రసిద్ధ భాషా శాస్త్రవేత్తలను గుర్తించి, వారికి గౌరవ డాక్టరేట్లను ప్రదానం చేశారు.




ద్రావిడ వర్సిటీలో శుక్రవారం లక్ష్మీనారాయణ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఇన్‌ఛార్జి వీసీ దొరస్వామి, ఇన్‌ఛార్జి రిజిస్ట్రార్ కిరణ్‌కుమార్

ద్రావిడ వర్సిటీకి స్వర్ణయుగం

ఆచార్య గంగిశెట్టి లక్ష్మీనారాయణ హయాంలోనే ద్రావిడ విశ్వవిద్యాలయానికి యూజీసీ గుర్తింపు లభించింది. దీంతో యూజీసీ నిధులు మంజూరై వర్సిటీ అభివృద్ధికి తోడ్పడ్డాయి. అంతేకాదు, తమిళనాడు, కర్ణాటక తదితర ద్రావిడ రాష్ట్రాలనుంచి ప్రత్యేక నిధులు రాబట్టి, యూనివర్సిటీలోని ఆయా శాఖల అభివృద్ధికి వినియోగించారు.విశ్వవిద్యాలయ ఆవరణలోని అక్కమహాదేవి బాలికల వసతి గృహ నిర్మాణానికి గంగిశెట్టి హయాంలోనే కర్ణాటక ప్రభుత్వం రూ.50 లక్షల నిధులు ఇచ్చింది. ఇంకా కర్ణాటక ఇచ్చిన రూ.10 లక్షల నిధులతో తుళు అధ్యయన పీఠాన్ని ఏర్పాటు చేశారు. మూలికావనం కూడా ఆయన ఆలోచన నుంచి ఉద్భవించిందే.కేవలం భాషా శాఖలే కాదు- బయోటెక్నాలజీ, కెమిస్ట్రీ, కామర్స్ అండ్ మేనేజ్‌మెంట్, మ్యాథ్స్ అండ్ స్టాటిస్టిక్స్, లాంగ్వేజ్ టీచింగ్ టెక్నాలజీ, ఎంబీయే, ఎంసీయే వంటి ఆధునిక ఉపాధి రంగానికి అవసరమైన కోర్సులన్నింటినీ ప్రవేశపెట్టిన ఘనత కూడా ఆయనకు దక్కుతుంది.ద్రావిడ విశ్వవిద్యాలయ తొట్టతొలి కాన్వకేషన్‌ను 2007లో లక్ష్మీనారాయణే ప్రారంభించారు. పదవీ విరమణ చేసే ముందు 2008వ సంవత్సరంలో సైతం తమిళనాడు ప్రభుత్వంనుంచి టీచింగ్ పోస్టులు సాధించగలగడం ద్రావిడ విశ్వవిద్యాలయం పట్ల గంగిశెట్టి చిత్తశుద్ధికి నిదర్శనం. కాగా ద్రావిడ విశ్వవిద్యాలయానికి ఒక గుర్తింపును తెచ్చిన సాహిత్య వేత్త మరణం ద్రావిడ భాషామ తల్లికి తీరని లోటు అని ఆంగ్ల శాఖ ఆచార్యుడు తిరుపతి రావు వ్యాఖ్యానించారు.

ఎస్.గొల్లపల్లెలో ఒంటరి ఏనుగు హల్‌చల్



రామకుప్పం, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): రామకుప్పం మండలం ఎస్.గొల్లపల్లె సమీపంలో ఒంటరి ఏనుగు సంచారం గ్రామస్తులను ఆందోళనకు గురిచేస్తోంది. గురువారం రాత్రి అడవిలో నుంచి ఒంటరి ఏనుగు పొలాల వైపు వస్తుండగా గ్రామస్తులు గమనించి అటవీ అధికారులకు సమాచారమిచ్చారు. దీంతో అటవీ అధికారులు ట్రాకర్లతో కలిసి ఏనుగును అడవిలోకి తరిమేందుకు ప్రయత్నించారు. చివరకు శుక్రవారం ఉదయం గ్రామ సమీపంలోని ఓ కుంటలో ఆ ఏనుగును గమనించి అడవిలోకి తరిమేశారు. తిరిగి ఒంటరి ఏనుగు గ్రామం వైపు వస్తుందేమోనని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.చీకటి పడ్డాక రైతులెవరూ పొలాల వద్దకు వెళ్ళరాదని, ఏనుగులను రెచ్చగొట్టే ప్రయత్నాలు చేయరాదని అటవీ విభాగాధికారి హరికుమార్ కోరారు.

పులిచెర్ల మండలంలోకి జంట ఏనుగులు

కల్లూరు, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): పులిచెర్ల మండలంలోకి బుధవారం రాత్రి జంట ఏనుగులు ప్రవేశించడంతో ప్రజలు భయాందోళన చెందుతున్నారు. పశ్చిమ విభాగం అటవీ ప్రాంతం నుంచి ఎద్దులవారిపల్లి వద్దకు జంట ఏనుగులు చేరుకున్నాయి. సమీపంలోని కల్లూరు-చిత్తూరు జాతీయ రహదారిని దాటుకొని తూర్పు విభాగం అటవీ ప్రాంతంలోకి వెళ్లేందుకు జంట ఏనుగులు ప్రయత్నించాయి. అయితే రహదారిపై వాహనాల రాకపోకలతో వీలుపడక వచ్చిన దారిలోనే వెనుదిరిగి గోగులమ్మవంక సమీపంలోకి చేరుకున్నాయి. రెండురోజులుగా మండల సరిహద్దులోని అటవీ ప్రాంతంలో తిష్టవేశాయి. దీంతో పంటలపై ఎప్పుడు దాడులు చేస్తాయో తెలియక ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.కల్లూరు నుంచి గంటావారిపల్లికి వెళ్లే మార్గంలో ప్రజలు జాగ్రత్తలు తీసుకోవాలని ఎఫ్‌బీవో శ్రీదేవి హెచ్చరించారు.రాత్రి పూట పంట పొలాల వద్ద బస చేయరాదన్నారు.

గృహ వినియోగదారులకు విద్యుత్‌శాఖ శుభవార్త

వెదురుకుప్పం, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): గృహ వినియోగదారులకు ఇది శుభవార్తే. అదనపు లోడ్లపై అభివృద్ధి చార్జీలపై 50 శాతం రాయితీ ఇచ్చే పథకం జూన్ నెలాఖరుకు ముగిసింది. ఈ పథకాన్ని ఈనెల ఒకటి నుంచి ఈ ఏడాది డిసెంబరు నెలాఖరు వరకు పొడిగిస్తూ శుక్రవారం ఉత్తర్వులను జారీ చేసింది. డిస్కంలు ఈ పథకానికి విస్తృతంగా ప్రచారం కల్పించాలని సూచించింది. ఈ పథకం అమలుపై నెలవారీ పురోగతి నివేదికలను సెప్టెంబరు మొదటి వారం నాటికి కమిషన్‌కి సమర్పించాలని ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

డీఐఈవోగా రఘుపతి



చిత్తూరు సెంట్రల్, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): జిల్లా ఇంటర్మీడియట్ విద్యాశాఖాధికారి (డీఐఈవో)గా ఎ.రఘుపతిని నియమిస్తూ ఇంటర్మీడియట్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ క్రితిక శుక్లా శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఇక్కడ డీఐఈవోగా పనిచేస్తున్న శ్రీనివాసులు జూలై నెలలో పదవీ విరమణ చెందారు. ఈయన స్థానంలో పుంగనూరు ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్‌ను ఇన్‌చార్జి డీఐఈవోగా నియమించారు. ఈ నేపథ్యంలో తిరుపతి జిల్లా వరదయ్యపాళ్యం మండలం ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ ఎ.రఘుపతిని డీఐఈవోగా నియమించారు. ఈయన శనివారం జిల్లా కార్యాలయంలో బాధ్యతలు చేపట్టనున్నారు.

హామీల అమలే ధ్యేయం

● మంత్రి బీసీ జనార్దన రెడ్డి

బైరెడ్డిపల్లె, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి) : ప్రజలకు ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలను అమలు చేయడమే ధ్యేయంగా ప్రభుత్వం పని చేస్తున్నట్లు రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖామంత్రి బీసీ జనార్దన రెడ్డి చెప్పారు.బైరెడ్డిపల్లెలో శుక్రవారం జరిగిన సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమంలో ఎమ్మెల్యే అమరనాథరెడ్డితో కలసి మంత్రి పాల్గొన్నారు.గాంధీవీధితో పాటు కురబవీధిలో ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అమలుచేస్తున్న సంక్షేమపథకాల గురించి అడిగి తెలుసుకున్నారు.కురబవీధిలో జరిగిన సభలో మంత్రి మాట్లాడుతూ ఈనెల 15వతేది నుంచి ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణసౌకర్యం కూడా అమలు చేయడానికి సన్నాహాలు జరుగుతున్నాయన్నారు. రాజకీయ ఉనికిని కాపాడుకోవడానికే జగన్ పర్యటనలు చేస్తూ ప్రజలను మభ్యపెడుతున్నారని విమర్శించారు.వైసీపీ పాలనలో తాడేపల్లె ప్యాలెస్‌లో వుంటూ పరదాల చాటున తిరిగిన జగన్ ప్రజలకు ఏంచేశారో అందరికీ తెలిసిందేనన్నారు.ఎమ్మెల్యే అమరనాథరెడ్డి మాట్లాడుతూ వైసీపీ పాలనలో నిర్వీర్యమైన వ్యవస్థలను సక్రమంగా తీర్చిదిద్ది సంక్షేమం, అభివృద్ధిని సమానంగా అమలుచేయడానికి ప్రభుత్వం కృషిచేస్తోందన్నారు.బైరెడ్డిపల్లె, వి.కోటల్లో బైపాస్‌రోడ్ల ఏర్పాటు, ఎక్స్‌ప్రెస్‌హైవే ద్వారా అభివృద్ధిపనులు ముమ్మరంగా జరుగుతున్నాయన్నారు.డీసీసీబీ ఛైర్మన్ అమాస రాజశేఖరరెడ్డి, టీడీపీ మండలాధ్యక్షుడు కిశోర్‌గౌడు, ప్రధాన కార్యదర్శి సుబ్రహ్మణ్యంశెట్టి, తెలుగుయువత అధ్యక్షుడు భువనచంద్రగౌడు, జనసేన నాయకులు దిలీప్, చైతన్యకుమార్, బీజేపీ నాయకుడు వెంకటరమణ, ఎంపీడీవో రాజేంద్రబాలాజి, తహసీల్దార్ ప్రసన్నకుమార్ తదితరులు పాల్గొన్నారు.



సంక్షేమపథకాల కరపత్రాలను పంపిణీచేస్తున్న మంత్రి జనార్దన్‌రెడ్డి, ఎమ్మెల్యే అమరనాథరెడ్డి

94 శాతం పింఛన్ల పంపిణీ

చిత్తూరు సెంట్రల్, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్ భరోసా సామాజిక పెన్షన్ పంపిణీ తొలిరోజైన శుక్రవారం జిల్లావ్యాప్తంగా 94.50 శాతం జరిగింది. జిల్లా వ్యాప్తంగా 2,69,025 మందికి గాను 2,55,247 మందికి గ్రామ, వార్డు సచివాలయ సిబ్బంది పింఛన్లు అందజేశారు. మిగిలిన 13,778 మందికి శనివారం అందజేయనున్నారు. చిత్తూరు నగరపాలక పరిధిలో శుక్రవారం జరిగిన ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీని కలెక్టర్ సుమిత్‌కుమార్ పరిశీలించారు. 9వ వార్డులోని గాంధీనగర్‌లో లబ్ధిదారులకు వార్డు సచివాలయ సిబ్బంది పింఛను సొమ్ము అందజేస్తున్న విధానాన్ని గమనించారు. ఈ సందర్భంగా కొత్తగా మంజూరైన స్పౌజ్ పింఛన్ల పంపిణీపై కమిషనర్‌తో మాట్లాడారు. లబ్ధిదారుల ఇంటి వద్దకే వెళ్లి పింఛను సొమ్ము అందించాలని ఆదేశించారు.



లబ్ధిదారులతో మాట్లాడుతున్న కలెక్టర్




సుధా రఘునాథన్ - గాయని ఉష

శ్రీవారి సేవలో ప్రముఖులు

తిరుమల శ్రీవారిని శుక్రవారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. వారిలో ప్రముఖ గాయని పద్మభూషణ్ సుధా రఘునాథన్, సినీ గాయని ఉష, ఢిల్లీ మంత్రి పర్వేష్ వర్మ ఉన్నారు.

- తిరుమల, ఆంధ్రజ్యోతి



చెంగాళమ్మకు పుష్పయాగం

శ్రావణ మాసం రెండో శుక్రవారం సందర్భంగా సూళ్లూరుపేటలోని చెంగాళమ్మకు పుష్ప యాగం నిర్వహించారు. ఆస్థాన మండపంలో అమ్మవారి ఉత్సవమూర్తికి 20 రకాల పుష్పాలు, 6రకాల పత్రాలతో పుష్పార్చన చేశారు. చామంతి, సంపంగి, రోజా, తామర, కనకాంబరం, మల్లె, గన్నేరు, నూరు వరహాలు, గన్నేరు, మొగలిరేకులు,మానససంపంగి పుష్పాలు, తులసి, మరువం, దవణం, బిల్వం, పన్నీరు, కదరిపచ్చ పత్రాలను వినియోగించారు. చెన్నైకి చెందిన నంబూరు మోహన్‌రావు, సులోచనమ్మ, నంబూరు మనోజ్‌సాయి, లత దంపతులు ఉభయకర్తలుగా వ్యవహరించారు. సహాయ కమిషనర్ ప్రసన్నలక్ష్మి, ట్రస్టుబోర్డు మాజీ సభ్యులు ఆకుతోట రమేష్, ముంగర అమరావతి, భక్తులు పాల్గొన్నారు. - సూళ్లూరుపేట, ఆంధ్రజ్యోతి



అమ్మవారి పాదాల చెంత పూజలుచేసి పుష్పాలను తీసుకొస్తున్న ఉభయదాతలు

సర్వదర్శనానికి 14 గంటలు

తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 14 గంటల సమయం పడుతోంది. శుక్రవారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లో 31 కంపార్టుమెంట్లు, నారాయణగిరిలో 2 షెడ్లలో సర్వదర్శన భక్తులు, వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 6 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు.

బుధవారం హుండీ ఆదాయం: రూ.4.66 కోట్లు

గురువారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 66,149

తలనీలాలు సమర్పించినవారు: 24,429



కథనం, ఇంటర్వ్యూ : తిరుపతి, ఆంధ్రజ్యోతి

రూ.123 కోట్లతో అభివృద్ధి చేశా!

ప్రోగ్రెస్ రిపోర్ట్

చిత్తూరు, తిరుపతి.. రెండు జిల్లాల్లో భాగంగా ఉన్న నియోజకవర్గం నగరి. తమిళనాడు సరిహద్దుల్లో ఉన్న ఈ నియోజకవర్గంలో రచ్చలూ రావిళ్లతోనూ రాజకీయాలు నడుస్తాయి. పార్టీ ఏదైనా ఇక్కడ గ్రూపులు సహజం. ఏకతాటిపై నడక అసాధ్యం. ఇటువంటి చోట టీడీపీ ఎమ్మెల్యేగా 2024లో తొలి విజయం అందుకున్నారు గాలి భాను ప్రకాష్. తండ్రి దివంగత గాలి ముద్దుకృష్ణమనాయుడు తరహాలోనే నిరంతరం జనంలో ఉంటారు. జనం చెప్పింది వింటారు. చేయగలిగిందే చెబుతారు. చెప్పింది వెంటనే చేస్తారు. నగరి నియోజకవర్గంలో అభివృద్ధి ముద్రతో మరింత ఎదగాలని ఆశపడుతున్న గాలి భానుప్రకాష్‌తో తొలి ఏడాది పాలనపై ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ...



నేడు

నగరి మండలం గుండ్రాజుకుప్పం పంచాయతీ మారుతీనగర్‌లో రూ.8.40 లక్షలతో కొత్తగా నిర్మించిన సిమెంటు రోడ్డు



నాడు

అదే చోట రోడ్డు వేయకముందు పరిస్థితి



నగరి ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్

వడమాలపేటలో ఫైవ్‌స్టార్ లగ్జరీ రిసార్టులు

నగరి నియోజకవర్గాన్ని పర్యాటక పరంగా అభివృద్ధి చేయడంపై ప్రత్యేక దృష్టి సారించా. ఆతిథ్య రంగంలోనూ పెట్టుబడులు రప్పించడానికి ప్రయత్నిస్తున్నా. దానివల్ల స్థానిక యువతకు ఉపాధి దొరుకుతుంది. వ్యక్తిగత చొరవతో ఫైవ్ స్టార్, సెవెన్ స్టార్ రిసార్టులు, హోటళ్ల ఏర్పాటుకు ప్రయత్నిస్తున్నా. మొదటి ప్రయత్నంగా వడమాలపేట మండలం ఎస్వీపురం వద్ద పర్యాటక శాఖకు 12 ఎకరాల భూమిని ఇటీవలే ప్రభుత్వం కేటాయించేలా చూశా. ఆ భూమిని పర్యాటక శాఖ అట్మోస్ఫియర్ కోర్ అనే సంస్థకు ఫైవ్ స్టార్ లగ్జరీ రిసార్టుల కోసం కేటాయించనుంది.



తిరుమలకుప్పంలో నిర్మాణంలో ఉన్న 33/11కేవీ విద్యుత్తు సబ్‌స్టేషన్

గాలి భానుప్రకాష్

పుట్టిన తేదీ: జూన్ 20,

తల్లిదండ్రులు : గాలి సరస్వతమ్మ, గాలి ముద్దుకృష్ణమనాయుడు

చదువు: అమెరికాలో మాస్టర్స్,

కుటుంబం: భార్య గాలి శిరీష, కుమారులు గాలి కృష్ణ, గాలి రామ్‌నాయుడు

- నగరి మండలం గుండ్రాజుకుప్పం, పుత్తూరు మండలం తిరుమలకుప్పంలో విద్యుత్ సబ్‌స్టేషన్లు మంజూరు చేయించా. తిరుమలకుప్పంలో నిర్మాణం దాదాపు పూర్తి కావచ్చింది. గుండ్రాజుకుప్పంలో పనులు త్వరలో ప్రారంభమవుతాయి.

గ్రావెల్.. లా అండ్ ఆర్డర్.. అండర్ కంట్రోల్

గతంలో నగరి నియోజకవర్గం గ్రావెల్ అక్రమ రవాణాకు పేరుమోసింది. అలాగే శాంతి భద్రతలు కూడా సక్రమంగా వుండేవి కావు. ఈ రెండింటి పట్ల కఠిన వైఖరి తీసుకున్నాం. ఇపుడు నియోజకవర్గం మొత్తం మీద ఎక్కడా గ్రావెల్ అక్రమ రవాణా అన్న మాటే వినిపించడంలేదు.

ఏడాదిలో ఏం చేశారు?

పల్లెలకు బస్సులు



పుత్తూరు డిపో పరిధిలో ఈ ఏడాది కాలంలోనే ఎనిమిది కొత్త బస్సు సర్వీసులు ప్రారంభించాం. అగరంపేట నుంచి 9వ మైలు, కండ్రిగల మీదుగా నగరికి, వెంగళత్తూరు నుంచి నింద్ర మీదుగా పిచ్చాటూరుకు, పరమాల నుంచి కుప్పం బాదూరు, బట్టి కండ్రిగల మీదుగా పుత్తూరుకు, ఎగువ పుత్తూరు నుంచి పాలమంగళం, సుబ్బానాయుడు కండ్రిగల మీదుగా పుత్తూరుకు, ఎలకటూరు నుంచి కావనూరు, కీలంబాకం, ఆరూరు మీదుగా నగరికి, పుత్తూరు నుంచి నారాయణవనం, గోవిందప్ప నాయుడు కండ్రిగ మీదుగా కైలాసకోనకు... ఇలా ఆరు మార్గాల్లో ప్రారంభించాం.




నింద్ర మండలం కైపాకం పంచాయతీలో రూ.15 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్డును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్

వచ్చే నెల నుంచీ మరమగ్గాలకు ఉచిత కరెంటు



నగరి, పుత్తూరు, నారాయణవనం మండలాల్లో 5500 మంది మరమగ్గాల కార్మికులున్నారు. మరమగ్గాలకు 500 యూనిట్ల వరకూ ఉచిత కరెంటు ఇవ్వాలని ఎన్నికలకు ముందే సీఎం చంద్రబాబును కోరా. ఆయన ఆమోదించారు. ఆగస్టు విద్యుత్ బిల్లు సెప్టెంబరులో వస్తుంది. ఆ బిల్లు నుంచీ ఉచిత విద్యుత్ అమల్లోకి రానుంది. నగరిలో 5500 మందికి లబ్ధి కలగనుంది.

ఇవి చేశాం

- రూ. 23.41 కోట్లతో 45 కిలోమీటర్ల సీసీ రోడ్ల నిర్మాణం మొదలు. 32 కిలోమీటర్లు పూర్తి.
- రూ. 13 కోట్లతో గోకులం షెడ్లు పూర్తి అయ్యాయి.
- తుడా నుంచి రూ. 34.18 కోట్లతో తారు రోడ్లు, సీసీ రోడ్లు, తాగునీటి పథకాలు మంజూరు చేయించాం. రూ. 32 కోట్లతో తాగునీటి పథకాల పనులన్నీ పూర్తయ్యాయి.
- నియోజకవర్గంలో జడ్పీ, ఆర్ అండ్ బీ శాఖల నుంచీ రూ. 12.56 కోట్లతో సీసీ రోడ్ల నిర్మాణం, తారు రోడ్ల మరమ్మతులు, తాగునీటి పథకాల పనులు మంజూరయ్యాయి. రూ. 1.61 కోట్లతో తాగునీటి పనులు పూర్తయ్యాయి. మరో రూ. 4.80 కోట్లతో 90 కిలోమీటర్ల మేర సీసీ రోడ్ల నిర్మాణం జరిగింది. ఆర్ అండ్ బీ ద్వారా రూ. 6.15 కోట్లతో 190 కిలోమీటర్ల మేర రోడ్లకు ప్యాచ్ వర్కులు చేపట్టాం.



రూ.68 లక్షలతో బాగుపడిన విజయపురం మండలంలోని నెట్టేరి- కనకమ్మసత్రం రోడ్డు

చంద్రబాబును కోరుతున్నది ఇవే!

- పుత్తూరు ప్రభుత్వాసుపత్రిని వంద పడకలకు స్థాయికి పెంపు
- గాలేరు-నగరి సుజల స్రవంతిని పూర్తి చేయాలి.
- వడమాలపేటలో ఈఎంసీ-3 ఏర్పాటు.
- నగరిలో టెక్స్‌టైల్ పార్కు ఏర్పాటు. దానికోసం వీకేఆర్‌పురం వద్ద 150 ఎకరాలు గుర్తించాం.

ఇవి చేయాలి

- రూ. 1.20 కోట్లతో 2.45 కిలోమీటర్ల సీసీ రోడ్ల నిర్మాణం చేపట్టాల్సి వుంది. ఇంకో రూ. 8.67 కోట్లతో 12.16 కిలోమీటర్ల మేరకు పనులు ప్రతిపాదించడం జరిగింది. రూ. 40.54 కోట్లతో 37.76 కిలోమీటర్ల మేరకు తారు రోడ్ల నిర్మాణం చేపట్టాల్సి వుంది.
- రూ. 70 లక్షల తుడ నిధులతో 1.17 కిలోమీటర్ల తారు రోడ్డు చేపట్టాల్సి వుంది. అలాగే రూ. 1.48 కోట్లతో 2.44 కిలోమీటర్ల సీసీ రోడ్లు నిర్మించాల్సి వుంది.
- నియోజకవర్గంలో ఆరు విద్యుత్ సబ్ స్టేషన్లు ఏర్పాటు చేయాలి.
- ఎంఎస్ఎంఈ పార్కు ఏర్పాటు చేయాలి. ఇందు కోసం విజయపురం మండలం కోసలనగరంలో 500 ఎకరాలు గుర్తించాం.
- నగరి వద్ద ఏకాంబరకుప్పం, అలాగే పుత్తూరులో ఆర్డీఎం గేటు, మరాఠీ గేటు తదితర మూడు రైల్వే లెవల్ క్రాసింగులున్న చోట్ల ఆర్వోబీల నిర్మాణం కోసం రైల్వే ఉన్నతాధికారులను కలసి ప్రతిపాదనలు అందజేశా.
- పుత్తూరు నుంచీ చెన్నై వరకూ ఇపుడున్న డబుల్ రోడ్డును సిక్స్ లేన్‌గా విస్తరించాలని ఢిల్లీలో కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీని కలసి కోరాను.

మహిళా ఎమ్మెల్యేని కించపరిచిన వ్యక్తికి పరామర్శా?

- **జగన్ తీరు మార్చుకోకపోతే సింగిల్ డిజిట్టేనన్న ఎమ్మెల్యే విజయశ్రీ**

సూళ్లూరుపేట, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): ఒక మహిళా ఎమ్మెల్యేపై అసభ్యకరంగా మాట్లాడి కించపురరిచిన మాజీ ఎమ్మెల్యే ప్రసన్నకుమార్ రెడ్డిని జగన్ పరామర్శించడం సిగ్గుచేటని ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ అన్నారు. మాజీ ఎమ్మెల్యేలు, వైసీపీ నాయకులు ఇతరులను హేళనగా మాట్లాడితే ఖండిచాల్సిన అధినేతే, వారిని పరామర్శించి రెచ్చగొట్టేలా మాట్లాడటం మంచి పద్ధతి కాదన్నారు. జగన్ తీరు మార్చుకోకపోతే ఈసారి సింగిల్ డిజిట్‌కే పరిమితమవ్వడం ఖాయమని జోస్యం చెప్పారు. సూళ్లూరుపేటలో శుక్రవారం ఆమె మాట్లాడుతూ, నెల్లూరు పర్యటనలో అనుమతి లేకపోయిన రెచ్చగొట్టే మాటలు మాట్లాడి పోలీసులను తోసేసి తాము అధికారంలోకి వస్తే చంపుతాం.. నరుకుతాం.. అధికారులను జైలుకు పంపుతామని మాజీ సీఎం హోదాలో మాట్లాడటం రికాదన్నారు.

నాటు బాంబు పేలి ఉపాధి కూలీకి తీవ్రగాయాలు



గాయపడిన జమునమ్మ

నాగలాపురం, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): నాటు బాంబు పేలి ఉపాధి కూలీకి తీవ్ర గాయాలయ్యాయి.ఈ సంఘటన శుక్రవారం నాగలాపురం మండలంలో చోటు చేసుకుంది. బాధితురాలి కథనం మేరకు... కస్తూరినాయుడు కండ్రిగ ఎస్టీ కాలనీ అటవీ ప్రాంతంలో శుక్రవారం ఉదయం ఉపాధి కూలీలు పనులు చేపట్టారు. ఆ సమయంలో సురుటుపల్లి పంచాయతీలోని లింగమ నాయుడు కండ్రిగ గ్రామానికి చెందిన కూలీ జమునమ్మ(60) పనులు చేస్తుండగా గుర్తుతెలియని వ్యక్తులు వేట కోసం పెట్టిన నాటు బాంబు ఆమె చేతికి తగిలి పేలిపోయింది. ఎడమ చేతికి తీవ్ర గాయాలపాలైంది. వెంటనే అక్కడి ఫీల్డ్ అసిస్టెంట్, ఉపాధి కూలీలు ఆమెను సమీప తమిళనాడు ప్రాంతంలోని ఊత్తుకోట జీహెచ్‌కి తరలించి ప్రథమ చికిత్స చేయించారు. మెరుగైన చికిత్స నిమిత్తం చెన్నై స్టాండ్లీ ఆస్పత్రికి తరలించారు. దీనిపై ఫీల్డ్ అసిస్టెంట్ మోహన, బాధితురాలు బంధువులు నాగలాపురం పోలీసులకు ఫిర్యాదు చేశారు. సత్యవేడు పోలీసులు సంఘటన స్థలాన్ని పరిశీలించారు. వివరాలు నమోదు చేసుకున్నారు.

ప్రసన్న మృతిపై దర్యాప్తు ముమ్మరం: సీఐ

ఏర్పేడు, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): ఏర్పేడు మండలం మన్నసముద్రం గ్రామానికి చెందిన ప్రసన్న(30) 20రోజుల క్రితం దొంగతనానికి పాల్పడిందని పక్కింటి వారు వేధించి.. దాడి చేయడంతో మనస్తాపానికి గురై ఆత్మహత్య చేసుకుంది. ఈ విషాదకర ఘటనపై 'ఆంధ్రజ్యోతి'లో శుక్రవారం వార్త ప్రచురితమైంది. దీనిపై ఏర్పేడు సీఐ శ్రీకాంత్ రెడ్డి కేసు దర్యాప్తును ముమ్మరం చేశారు. పోలీసు సిబ్బందిని మన్నసముద్రం పంపి విచారణ చేపట్టారు. పరారీలో ఉన్న నిందితుల కోసం ముమ్మరంగా ప్రయత్నాలు చేస్తున్నారు. త్వరలో వారిని పట్టుకుని చర్యలు తీసుకుంటామని సీఐ తెలిపారు.

9వ బెటాలియన్ కమాండెంట్ బాధ్యతల స్వీకరణ



ఈఎస్ఎస్ ప్రసాద్

వెంకటగిరి టౌన్, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): వల్లివేడు వద్ద ఉన్న 9వ బెటాలియన్ కమాండెంట్‌గా ఈఎస్ఎస్ ప్రసాద్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ... అమరావతి డీజీపీ కార్యాలయంలో కమాండెంట్‌గా విధులు నిర్వహిస్తూ 9వ బెటాలియన్‌కు బదీలీపై వచ్చానన్నారు. బెటాలియన్ అభివృద్ధికి కృషి చేస్తానని చెప్పారు. సిబ్బంది పనితీరుపై ప్రత్యేక దృష్టి పెట్టి, వారి సమస్యల పరిష్కరిస్తానన్నారు. అనంతరం సిబ్బంది ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కమాండెంట్ అరుణ్‌బోస్, సిబ్బంది పాల్గొన్నారు.

చెట్లను నరికి.. పంట కాలువ పూడ్చి



టోల్‌ప్లాజా సమీపంలో జాతీయ రహదారిపై నరికిన చెట్లు

- **సూళ్లూరుపేటల లేఅవుట్ నిర్వాహకుల నిర్వాకం**

సూళ్లూరుపేట, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేట టోల్ ప్లాజా సమీపంలో జాతీయ రహదారి పక్కన ఓ లేఅవుట్ నిర్వాహకులు చెట్లను నరికేశారు. పట్ట పగలే చెట్లను నరికి కలపను సైతం ఇతర ప్రాంతాలకు గుట్టుచప్పుడు కాకుండా తరలిస్తున్నారు. అనుమతుల్లేకుండా ఇలా చేయడంపై తీవ్ర విమర్శలు వస్తున్నాయి. టోల్‌ప్లాజా సిబ్బంది కూడా అధికారులకు సమాచారం ఇవ్వలేదు. ఇక, ఎస్వీకండ్రిగ వరకు వచ్చే నెర్రికాలువకు అనుసంధానమైన పంట కాలువను పూడ్చేసి చదును చేశారు. దాదాపు 7 గ్రామాలకు పైగా 5 వేల ఎకరాలకు పైగా ఈ కాలువ గుండా సాగునీరందుతోంది. ఈ ఎప్పుడు సాగునీరందించే పంట కాలువను పూడ్చేసి హైవే రోడ్డుకు సమాంతరంగా గ్రావెల్ రోడ్డుతో చదును చేసి లేఅవుట్‌లోకి దారులు ఏర్పాటు చేసుకుంటున్నారు. దీనిపై అధికారులు చర్యలు చేపట్టాల్సి ఉంది.



పంట కాలువను పూడ్చేసి గ్రావెల్‌తో చదునుచేసి రోడ్డు వేసిన దృశ్యం

అక్రమాలకు బాస్.. జగన్

- **మహిళలకు క్షమాపణలు చెప్పాలన్న టీడీపీ**



తిరుపతి(జీవకోన), ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): వైసీపీ పాలనలో రాష్ట్రంలో జరిగిన అన్ని అక్రమాలకు బాస్.. జగన్ అని తిరుపతి పార్లమెంటు టీడీపీ అధ్యక్షుడు, యాదవ కార్పొరేషన్ చైర్మన్ నరసింహయాదవ్ అన్నారు. త్వరలోనే మరిన్ని అక్రమాలు బయటకు రానుండటంతో డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నాడని విమర్శించారు. తన అక్రమాలకు ఎపుడు అరెస్టు అవుతారో జగన్‌కే తెలియని పరిస్థితి ఏర్పడిందన్నారు. తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం ఆయన మాట్లాడుతూ, అధికారం కోల్పోవడం.. లిక్కర్ కేసులో ఆ పార్టీ నేతలు జైళ్లకు వెళ్లడంతో జగన్ మెంటల్ కండిషన్ సరిగాలేక చంద్రబాబుపై విమర్శలు చేస్తున్నారన్నారు. సభ్య సమాజం తలదించుకునేలా మహిళలపై నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలను సమర్థించిన జగన్.. మహిళా లోకానికి క్షమాపణ చెప్పాలని డిమాండు చేశారు. పెద్దిరెడ్డి ఎపుడో చంద్రబాబును కొట్టాడని, అందువల్లే మిథున్‌రెడ్డిపై కక్ష సాధిస్తున్నారని తప్పుడు ప్రచారాలు చేయడం జగన్ దిగజారుడుతనానికి నిదర్శనమన్నారు. శాంతి భద్రతలకు జగన్ విఘాతం కలిగిస్తున్నారని డిప్యూటీ మేయర్ ఆర్సీ మునికృష్ణ ఆరోపించారు. ఈ సమావేశంలో రాష్ట్ర మీడియా కోఆర్డినేటర్ శ్రీధర్‌వర్మ, నేతలు మన్నెం శ్రీనివాసులు, హేమంత్ యాదవ్, సుబ్బుయాదవ్, రామారావు పాల్గొన్నారు.

జగన్‌రెడ్డీ.. ఇదేమి తీరు!

- **అన్ని ఆధారాలతోనే చెవిరెడ్డి అరెస్టు జరిగిందన్న తుడా చైర్మన్**



తిరుపతి, ఆగస్టు1(ఆంధ్రజ్యోతి): 'మహిళా ఎమ్మెల్యేని అసభ్యకరంగా మాట్లాడిన ప్రసన్నకుమార్ రెడ్డిని.. ఒక తల్లిని అనరాని మాటలన్న వల్లభనేని వంశీని జగన్మోహన్‌రెడ్డి పరామర్శించడం విడ్డూరంగా ఉంది. తన కారు కింద పడి మృతి చెందిన కార్యకర్త కుటుంబాన్ని పరామర్శించలేని ఆయన.. అరెస్టయిన గంజాయి ముఠా నాయకులను, రౌడీషాటర్లు, స్త్రీలను అగౌరవంగా మాట్లాడుతున్న సంస్కారంలేని నాయకులను పరామర్శించడం ఏమిటి? జగన్ తీరు మార్చుకోకపోతే ప్రజలు ఓట్లు కాదు కదా.. రోడ్లమీదా తిరగనివ్వరు' అని తుడా చైర్మన్ డాలర్స్ దివాకర్‌రెడ్డి హెచ్చరించారు. శుక్రవారం తిరుపతిలోని తన నివాసంలో ఆయన ఆయన మీడియాతో మాట్లాడారు. ఇప్పుడు రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజలు ప్రశాంతంగా జీవిస్తుంటే, తన ఉనికికోసం జగన్ పరామర్శల పేరుతో తిరుగుతూ అలజడి సృష్టించాలని ప్రయత్నిస్తున్నారన్నారు. లిక్కర్ స్కాంలో ప్రతినెలా రూ.500 కోట్లు దోచేశారన్నారు. ఈ స్కామ్‌లో చంద్రగిరి మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డిని పక్కా ఆధారాలతోనే అరెస్ట్ చేశారన్నారు. ఆయన పీఏలు, గన్‌మ్యాన్‌లు ఎక్కడెక్కడ డబ్బులు తీసుకొచ్చారు? ఎక్కడ దాచిపెట్టారు? ఎవరికి ఇచ్చారు? వారి వాహనాలు ఎక్కడ తిరిగాయనే శాటిలైట్ ఆధారాలు సిట్ వద్ద ఉన్నాయన్నారు.

'ఉల్లాస్ అక్షరాంధ్ర'పై శిక్షణ



సమావేశంలో ప్రసంగిస్తున్న డ్వామా పీడీ రవికుమార్

చిత్తూరు సెంట్రల్, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని వయోజనులను 2029 నాటికి అక్షరాస్యులుగా చేయడమే ఉల్లాస్ అక్షరాంధ్ర కార్యక్రమం ఉద్దేశమని డ్వామా పీడీ రవికుమార్ అన్నారు. వయోజన విద్య- విద్యాశాఖ సంయుక్త ఆధ్వర్యంలో శుక్రవారం డీఆర్‌డీఏ సమావేశ మందిరంలో ఉల్లాస్ అక్షరాంధ్ర జిల్లా స్థాయి శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. పీడీ మాట్లాడుతూ.. వేలి ముద్రలు వేసేవారు జిల్లాలో ఇంకా ఉన్నారన్నారు. 18-59 ఏళ్ల లోపు వారిలో నిరక్షరాస్యులను గుర్తించి, విద్యాబోధన చేయాల్సిన అవసరం ఉందన్నారు. జేడీఎస్‌డబ్ల్యూఎస్ శాఖ ద్వారా 2023లో నిర్వహించిన క్యాస్టు సర్వే ఆధారంగా జిల్లాలో 2,61,185 మంది నిరక్షరాస్యులను గుర్తించినట్లు తెలిపారు. డీఆర్‌డీఏ, మెప్మా, డ్వామా సహకారంతో తొలి విడతలో 76,410 మందికి, మిగిలిన వారిని రెండు, మూడు విడతల్లో అక్షరాస్యులుగా తీర్చిదిద్దాలన్నారు. విద్యావలంటీర్లు ఏపీఎంలు తదితర శాఖలన్నీ సమన్వయంతో పనిచేస్తే జిల్లాను అక్షరాస్యతలో మొదటి స్థానంలో తేవడం సులభం అవుతుందని చెప్పారు. వయోజన విద్యాశాఖ డిప్యూటీ డైరెక్టర్ మహ్మద్ ఆజాద్ మాట్లాడుతూ.. ఉల్లాస్ అక్షరాంధ్రలో భాగంగా డీఆర్‌డీఏ 5560 మంది మహిళలను, డ్వామా 6070 మంది పురుషులను, మెప్మా ద్వారా మున్సిపాలిటీల్లో 15,208 మందిని అక్షరాస్యులను చేయాలన్నారు. విద్యాశాఖ ఏడీ వెంకటేశ్వర్లు, డీపీవో ఏవో మొయినుద్దీన్, డీఆర్‌డీఏ డీపీఎం మంజుల, వయోజన విద్యాశాఖ ఉద్యోగులు, డీఆర్‌డీఏ ఏపీఎంలు, డ్వామా ఏపీవోలు, మెప్మా సీఎంఎంలు పాల్గొన్నారు.

'సమాచార హక్కు చట్టం'పై పోటీలు



పోటీల్లో పాల్గొన్న విద్యార్థినులు

చిత్తూరు సెంట్రల్, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): సమాచార హక్కు చట్టంపై నోడల్ రిసోర్స్ సెంటర్ (ఎన్‌ఆర్‌సీ) స్థాయిలో శుక్రవారం స్థానిక ఎస్‌పీ సావిత్రమ్మ మహిళా డిగ్రీ కళాశాలలో పోటీలు నిర్వహించారు. మదనపల్లెలోని బీటీ, ఉమెన్ కళాశాలలతోపాటు చిత్తూరు, కుప్పం, పలమనేరు, పుంగనూరు, కార్వేటినగరం, వెదురుకుప్పం, నగరి కళాశాలల్లోని విద్యార్థినులు ఈ పోటీల్లో పాల్గొన్నారు. సమాచార హక్కు చట్టం ఏర్పడి 20 ఏళ్లు పూర్తయిన సందర్భంగా ఈ చట్టంతో కలిగే ప్రయోజనాలు, ఉద్దేశం, పారదర్శకతపై వ్యాసరచన, వక్తృత్వ, డిబేట్, క్విజ్ విభాగాల్లో పోటీలు జరిగాయి. విజేతలైనవారు వారికి ఈనెల ఆరో తేదీన కడప ఆర్జేడీ కార్యాలయంలో నిర్వహించే పోటీల్లో పాల్గొననున్నారు. సావిత్రమ్మ కళాశాల ప్రిన్సిపాల్ మనోహర్, వైస్ ప్రిన్సిపాల్ నరేంద్ర, కోఆర్డినేటర్ వినీల, మదనపల్లె, కుప్పం, తదితర కళాశాలకు చెందిన అధ్యాపకులు పాల్గొన్నారు.

హత్య కేసుల్లో దర్యాప్తును త్వరగా పూర్తి చేయండి

సిబ్బందికి ఎస్పీ మణికంఠ ఆదేశం



వెదురుకుప్పంలో పోలీసులకు సూచనలిస్తున్న ఎస్పీ మణికంఠ

వెదురుకుప్పం, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): హత్య కేసుల్లో దర్యాప్తును త్వరగా పూర్తి చేయాలని సిబ్బందిని ఎస్పీ మణికంఠ ఆదేశించారు. కార్వేటినగరం సర్కిల్ పరిధిలో ఉన్న వెదురుకుప్పం, కార్వేటినగరం పోలీసుస్టేషన్లను, సర్కిల్ కేంద్రాన్ని శుక్రవారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రికార్డులను పరిశీలించి సిబ్బందికి పలు సూచనలిచ్చారు. మహిళలను మోసగించే, వేధించే వారిపై ప్రత్యేక నిఘా పెట్టాలని చెప్పారు. రోడ్డు ప్రమాదాల నియంత్రణ చర్యలు చేపట్టాలన్నారు. సారా తయారీ, విక్రయాలపై, రేషన్ బియ్యం అక్రమ రవాణాపై ప్రత్యేక నిఘా కొనసాగించాలని స్పష్టం చేశారు. అనంతరం సిబ్బంది సమస్యలను అడిగి తెలుసుకుని, పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఎస్‌ఐ వెంకటసుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

షియా ముస్లింల 'రక్తతర్పణం'



పీర్ల ఊరేగింపు - రక్తతర్పణం చేస్తున్న షియా ముస్లింలు

గంగాధరనెల్లూరు, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): గంగాధరనెల్లూరు అబ్బాస్‌కాలనీ వద్ద షియా ముస్లింలు శుక్రవారం పీర్లను ఊరేగించి, అజాదారిమాతం (రక్తతర్పణం) నిర్వహించి, మొక్కులు తీర్చుకున్నారు. మొహర్రంలో భాగంగా అంజుమన్ ఈ హైదరీ కమిటీ ఆధ్వర్యంలో షహజతే బీబీ షకీనా జ్ఞాపకార్థం షియా ముస్లింలు నల్ల దుస్తులు ధరించి గురువారం రాత్రి నుంచి శుక్రవారం ఉదయం వరకు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం అబ్బాస్‌కాలనీ మసీదు నుంచి పీర్లను ఊరేగిస్తూ గంగాధరనెల్లూరు - తూగుండ్రం రహదారిపై రక్తతర్పణం నిర్వహించారు. కమిటీ చైర్మన్ మౌలాసాహెబ్, వైస్ చైర్మన్ ముక్తార్ హుస్సేన్, మత గురువు విరాసత్ అలీ, స్థానికులతోపాటు తమిళనాడు, తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాల్లోని షియా ముస్లింలు కూడా పాల్గొన్నారు.

ఉద్యోగ విరమణ సన్మానం



సమావేశంలో ప్రసంగిస్తున్న చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని

చిత్తూరు రూరల్, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): జిల్లా గ్రంథాలయ సంస్థలో డిప్యూటీ లైబ్రేరియన్‌గా ఉద్యోగ విరమణ చేసిన లలితకు సన్మాన కార్యక్రమం చిత్తూరులోని హోటల్ సింధులో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని మాట్లాడుతూ.. లలిత సేవలు ఉద్యోగులకు ఆదర్శనీయమని చెప్పారు. 39ఏళ్లుగా గ్రంథాలయ సంస్థలో వివిధ హోదాలో పనిచేసి అందరి మన్ననలను పొందారన్నారు. జడ్పీ మాజీ చైర్‌పర్సన్ గీర్వాణి, చంద్రప్రకాష్ దంపతులు మాట్లాడుతూ.. జూనియర్ కళాశాలలో చదువుతున్నటి నుంచి లలిత, ఆమె భర్త భక్తవత్సలంతో తమ బంధం 48 ఏళ్లుగా కొనసాగుతోందన్నారు. మాజీ ఎమ్మెల్సీ దొరబాబు మాట్లాడుతూ 39 ఏళ్లుగా గ్రంథాలయ అభివృద్ధికి మచ్చలేకుండా పనిచేయడం విశేషమన్నారు. మాజీ ఎమ్మెల్యే ఏఎస్ మనోహర్, మాజీ మున్సిపల్ చైర్మన్ చెంగల్రాయనాయుడు, విజయం విద్యాసంస్థల చైర్మన్ తేజోమూర్తి, డైరెక్టర్ శైలజ, మాజీ లైబ్రేరియన్ విజయకుమార్, మధుబాబు తదితరులు పాల్గొన్నారు.



నూతన కార్యవర్గంతో ఎమ్మెల్యే మురళీమోహన్ తదితరులు

బంగారుపాళ్యం ఏఎంసీ కార్యవర్గ ప్రమాణ స్వీకారం

బంగారుపాళ్యం, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): బంగారుపాళ్యం వ్యవసాయ మార్కెట్ కమిటీ (ఏఎంసీ) కార్యవర్గ ప్రమాణ స్వీకారం శుక్రవారం ఘనంగా జరిగింది. బంగారుపాళ్యం మార్కెట్ యార్డులో జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే మురళీమోహన్ ప్రసంగించారు. నూతనంగా ఏర్పాటైన పాలకవర్గం రైతులకు అందుబాటులో ఉండాలని సూచించారు. రైతు శ్రేయస్సే కూటమి ప్రభుత్వ ధ్యేయమని చెప్పారు. మాజీ సీఎం జగన్.. బంగారుపాళ్యం పర్యటనకు బల నిరూపణ కోసమే వచ్చారని మండిపడ్డారు. అంతకుముందు పాలకవర్గంతో కలిసి ప్రభుత్వ కళాశాల వద్ద ఉన్న అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. అక్కడినుంచి బాణాసంచా కాలుస్తూ మార్కెట్ యార్డుకు భారీ ర్యాలీగా తరలివచ్చారు. నాలుగురోడ్ల కూడలి సమీపంలోకి రాగానే రైతులు, అభిమానులు తయారు చేసిన మామిడి కాయలు, కూరగాయలతో తయారైన భారీ మాలలను క్రేన్ సాయంతో నూతన కార్యవర్గ నేతలకు వేసి, స్వాగతం పలికారు. అనంతరం వితంతు పింఛన్లను లబ్ధిదారులకు ఎమ్మెల్యే పంపిణీ చేశారు. టీడీపీ మండల అధ్యక్షుడు ఎన్పీ ధరణీప్రసాద్, గౌరవాధ్యక్షుడు జయప్రకాశ్, నాయకులు కోదండయాదవ్, జనార్ధన్‌గౌడ్, గంగారపు గోపి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు జగదీష్, నియోజకవర్గంలోని టీడీపీ మండల అధ్యక్షులు, కార్యకర్తలు, రైతు నాయకులు పాల్గొన్నారు.

పాలక వర్గం ఇలా.. : చైర్మన్‌గా తవణంపల్లె మండలం వడ్డుపల్లె గ్రామానికి చెందిన కె.భాస్కర్ నాయుడు, వైస్ చైర్మన్‌గా ఐరాల మండలం దివిటీవారిపల్లెకి చెందిన సుధాకర్, డైరెక్టర్లుగా ఐరాల మండలం పుత్రమద్దికి చెందిన సుజన, డి.కొత్తూరుకు చెందిన పి.భాస్కర్‌నాయుడు, బంగారుపాళ్యం మండలం తుంబకు చెందిన చిరంజీవి, తవణంపల్లె మండలం పుణ్యసముద్రానికి చెందిన చిట్టెమ్మ, తవణంపల్లె మండలం దిగువమారేడుపల్లెకి చెందిన జగదీష్, యాదమరి మండలం బండివాండ్లపూరుకు చెందిన హరిప్రసాద్, వరదరాజులపల్లెకి చెందిన జ్యోతి, బంగారుపాళ్యం మండలం సంక్రాంతిపల్లెకు చెందిన నీలిమ, జంబువారిపల్లెకి చెందిన రవికుమారి (బీజేపీ), లక్ష్మీపురం గ్రామానికి చెందిన గిరిజ(జనసేన), తిమ్మోజుపల్లెకి చెందిన గౌరి, పూతలపట్టు మండలం ఎగువపాలకూరుకు చెందిన గురుస్వామి, బండపల్లెకి చెందిన రామానుజం, జంబువారిపల్లె సర్పంచ్ అమర, సింగిల్‌విండో అధ్యక్షుడు హేమచంద్రనాయుడు ఉన్నారు. వీరితో కార్యదర్శి వెంకటరమణ, పర్యవేక్షకుడు గంగయ్య ప్రమాణ స్వీకారం చేయించారు.

అభివృద్ధి పనులను వేగవంతం చేయండి

● మంత్రి బీసీ జనార్దన రెడ్డి

పలమనేరు, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం మంజూరు చేసిన అభివృద్ధి పనులను వేగవంతంగా టెండర్లు పిలిచి పనులు పూర్తిచేయాలని రోడ్లు భవనాలశాఖ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. శుక్రవారం పలమనేరు టీడీపీ కార్యాలయంలో మంత్రి చిత్తూరు, మదనపల్లి, పలమనేరు డివిజన్ల పరిధిలోని అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఎండీఆర్, ఎస్‌హెచ్, నాబార్డు కింద మంజూరైన రహదారి పనులకు వెంటనే టెండర్ల ప్రక్రియ పూర్తిచేసి 6 నెలల్లోపు పనులు పూర్తి చేయాలని సూచించారు. ఇంటర్ స్టేట్ ఫండ్స్ కోసం ప్రణాళిక తయారు చేసి నివేదికలివ్వాలని ఆదేశించారు. పనులు పూర్తిచేసిన కాంట్రాక్టర్లకు చెల్లిచాల్సిన బకాయిలను అధికారులు మంత్రి దృష్టికి తీసుకు రాగా.. వాటి చెల్లింపులకు చర్యలు తీసుకుంటామని మంత్రి హామీ ఇచ్చారు. సమావేశంలో ఎమ్మెల్యే అమరనాథరెడ్డి, డీసీసీబీ చైర్మన్ అమాస రాజశేఖరరెడ్డి పాల్గొన్నారు.



అధికారులతో సమీక్షిస్తున్న మంత్రి జనార్దన రెడ్డి

రాష్ట్రస్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులకు దరఖాస్తుల స్వీకరణ

చిత్తూరు సెంట్రల్, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని అన్ని ప్రభుత్వ, జడ్పీ, మండల పరిషత్, ఎయిడెడ్, పురపాలిక, ఏపీ రెసిడెన్షియల్ పాఠశాలల్లో పనిచేసే ఉపాధ్యాయుల నుంచి రాష్ట్ర స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులకు దరఖాస్తులు స్వీకరించనున్నట్లు డీఈవో వరలక్ష్మి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పదేళ్ల సర్వీసు ఉన్న ఉపాధ్యాయులు ఆన్‌లైన్ ద్వారా అవార్డుకు దరఖాస్తు చేసుకోవడంతోపాటు కాపీలను డీవైఈవో, డీఈవో కార్యాలయానికి మెయిల్ ద్వారా పంపాలన్నారు. ఈనెల 8వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని, డివిజన్ స్థాయిలో ఫైనల్ చేసిన దరఖాస్తులను డీవైఈవోలు 12వ తేదీలోపు డీఈవో కార్యాలయానికి పంపాలని, గడువు తర్వాత వచ్చిన దరఖాస్తులు స్వీకరించరని వివరించారు.

జగన్ తీరు గర్హనీయం : టీడీపీ

రామకుప్పం, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి) : వైసీపీ అధ్యక్షుడు జగన్ వ్యవహరిస్తున్న తీరు గర్హనీయమని టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, మాజీ ఎమ్మెల్సీ గౌనివారి శ్రీనివాసులు శుక్రవారం ఒక ప్రకటనలో ధ్వజమెత్తారు. రాష్ట్రంలో వైసీపీ నేతలు మహిళలు, ప్రజాప్రతినిధులను పరుష పదజాలంతో తిడుతుంటే పార్టీ అధ్యక్షుడిగా వారిని వారించి అదుపు చేయాల్సిన జగన్ వారిని పరామర్శించడమేంటని ప్రశ్నించారు. అధికారంలో ఉన్నపుడు వైసీపీ మంత్రులు, నేతలు మహిళలను కించపరిచేలా వ్యాఖ్యలు చేశారని, అప్పట్లో వారిని ప్రశ్నించిన వారిపై అక్రమ కేసులు బనాయించారన్నారు. వైసీపీ నేతలు, కార్యకర్తల అరాచకాలు, అవినీతిని భరించలేక ప్రజలు ఎన్నికల్లో ఆ పార్టీని ఘోరంగా ఓడించారని పేర్కొన్నారు. జగన్‌కు అన్ని యాత్రలు పూర్తయ్యాని ఇక జైలుయాత్ర ఒకటే మిగిలిందన్నారు. సీఎం చంద్రబాబు క్షణం తీరిక లేకుండా రాష్ట్రాభివృద్ధికి కృషి చేస్తుంటే జగన్ మాత్రం బాధ్యతారాహిత్యంగా జైళ్ల చుట్టూ తిరుగుతూ ఖైదీలు, రౌడీలను పరామర్శిస్తున్నారన్నారు. ఇదంతా చూస్తుంటే లిక్కర్ కేసులో అడ్డంగా దొరికిపోయిన జగన్ తనకు ఏ జైలులో సౌకర్యవంతంగా ఉంటుందోనని చూసుకుంటున్నారేమో అనిపిస్తోందని పేర్కొన్నారు. జగన్ తీరును రాష్ట్ర ప్రజలు గమనిస్తున్నారని.. భవిష్యత్తులో ఆయన పార్టీకి సమాధికట్టడం ఖాయమని వివరించారు.

9, 10 తేదీల్లో సీపీఐ జిల్లా మహాసభలు



సమావేశంలో ప్రసంగిస్తున్న నాగరాజు

చిత్తూరు రూరల్, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): సీపీఐ 24వ జిల్లా మహాసభలు ఈనెల 9, 10 తేదీల్లో జరగనున్నాయని సీపీఐ జిల్లా కార్యదర్శి నాగరాజు తెలిపారు. శుక్రవారం సీపీఐ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన ప్రసంగించారు. నిరంతరం అన్నివర్గాల ప్రజా సమస్యలపై రాజీలేని పోరాటాలు చేస్తున్న ఏకైక పార్టీ తమదేనని చెప్పారు. నాయకులు గోపీనాథ్, మణి, సత్యమూర్తి, విజయగౌరి తదితరులు పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వ పాలనపై ప్రజల్లో సంతృప్తి

మంత్రి జనార్దనరెడ్డి



మీడియా సమావేశంలో మంత్రి జనార్దనరెడ్డి, ఎమ్మెల్యే అమరనాథరెడ్డి ,డీసీసీబీ చైర్మన్ రాజశేఖర రెడ్డి

పలమనేరు, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి) : కూటమి ప్రభుత్వ పాలనపై ప్రజల్లో సంతృప్తి కన్పిస్తోం దని రాష్ట్ర రోడ్లు భవనాల శాఖా మంత్రి బీసీ జనార్దన రెడ్డి తెలిపారు. పలమనేరు టీడీపీ కార్యాలయంలో శుక్రవారం ఆయన మీడియా సమావేశంలో మాట్లాడుతూ ఎన్నికల మ్యానిఫెస్టోలో పేర్కొన్న సూపర్‌సిక్స్ హామీలను విజయవంతంగా అమలు చేస్తున్నట్లు చెప్పారు. సంక్షేమ, అభివృద్ధి పథకాలు ప్రజలకు అందుతున్న తీరుపై వారి సంతృప్తస్థాయిని తెలుసుకోవాలని ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశించారన్నారు.శుక్రవారం బైరెడ్డిపల్లెలో పర్యటించినప్పుడు కూటమి ప్రభుత్వ పనితీరుపట్ల ప్రజల్లో సంతృప్తి వ్యక్తమైందని పేర్కొన్నారు.పలమనేరు నియోజకవర్గంలో పలు రోడ్లు కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాలకు అనుసంధానమై దుస్థితిలో ఉన్నాయని, తిరుమలకు శుక్రవారం వచ్చిన కేంద్ర మంత్రి గడ్కరి దృష్టికి ఈ సమస్య తీసుకు వెళ్లి పరిష్కరించడానికి కృషి చేయనున్నట్లు వివరించారు. ఎమ్మెల్యే అమరనాథరెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి సింగపూర్ పర్యటన ద్వారా వేలాది కోట్ల రూపాయల పెట్టుబడులతో పరిశ్రమలు రానుండడంపై సంతోషం వెలిబుచ్చారు.ప్రతి ఇంటి నుంచీ ఓ పారిశ్రామికవేత్త తయారయ్యే విధంగా చర్యలు తీసుకొంటున్నారని పేర్కొన్నారు.

అంబేడ్కర్ గురుకులంలో అడ్మిషన్లకు దరఖాస్తుల ఆహ్వానం

రామకుప్పం, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): రామకుప్పం పట్టణ శివార్లలోని తిమ్మనసముద్రం వద్ద ఉన్న అంబేడ్కర్ గురుకుల విద్యాలయంలో ఐదో తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు ఖాళీగా ఉన్న సీట్లలో అడ్మిషన్ల కోసం అర్హత ఉన్న అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ రజనీకుమార్ ఒక ప్రకటనలో కోరారు. ఐదో తరగతిలో ఎస్సీ విద్యార్థులకు 35 సీట్లు, బీసీలకు 11, ఎస్టీలకు 5 సీట్లు ఖాళీగా ఉన్నాయని తెలిపారు. ఆరో తరగతిలో ఎస్సీలకు 4, బీసీలకు 9, ఏడో తరగతిలో బీసీలకు 9, ఎనిమిదో తరగతిలో ఓసీలకు 1, బీసీలకు 6, తొమ్మిదో తరగతిలో బీసీలకు 1, ఎస్టీలకు 2, పదో తరగతిలో ఎస్టీలకు 2, బీసీలకు 4, ఇంటర్ మొదటి సంవత్సరంలో ఎస్సీలకు 17, ఎస్టీలకు 2, బీసీలకు 10, ఓసీలకు 1, ఇంటర్ రెండో సంవత్సరంలో బీసీలకు 11, ఓసీలకు 1చొప్పున సీట్లు ఖాళీగా ఉన్నాయని ఆయన తెలిపారు. ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని ఆసక్తి గల అభ్యర్థులు వారంలోపు తమ దరఖాస్తులను విద్యాలయం కార్యాలయంలో సమర్పించాలని ఆయన కోరారు.

అన్నదమ్ములకు పోలీసు ఉద్యోగాలు



పోలీసు ఉద్యోగాలకు ఎంపికైన అన్నదమ్ములు

పుంగనూరు, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): పుంగనూరు మండలం కమతంపల్లెకు చెందిన ఓ రైతు కుమారులిద్దరూ పోలీసు ఉద్యోగాలకు ఎంపికయ్యారు. శుక్రవారం రాష్ట్ర ప్రభుత్వం కానిస్టేబుళ్ల మెయిన్స్ పరీక్షా ఫలితాలు విడుదల చేయడంతో కమతంపల్లెకు చెందిన రైతు రామప్ప కుమారులు దూళ్ల గంగిరెడ్డి, మునిరాజ ఎంపికయ్యారు. ఇద్దరూ పుంగనూరులో డిగ్రీ వరకు చదివారు. అనంతరం కానిస్టేబుల్ ఎంపిక పరీక్షలు రాసి అర్హత సాధించడంతో తండ్రి రామయ్య ఆనందం వ్యక్తం చేశారు. అలాగే పుంగనూరు కుమార్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పోలీస్ కోచింగ్ సెంటర్‌లో 97 మంది శిక్షణ పొందగా.. 29 మంది ఉత్తీర్ణత సాధించినట్లు డైరెక్టర్ దస్తగిరి తెలిపారు.

గోకులాలకు బిల్లు చెల్లింపులో జాప్యం వద్దు

● కలెక్టర్ ఆదేశం

చిత్తూరు కలెక్టరేట్, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): గోకులాలకు బిల్లుల చెల్లింపులో జాప్యం చేయవద్దని కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆదేశించారు.ఆంధ్రజ్యోతిలో 'గోకులాలకు బిల్లుల చెల్లింపుల్లో జాప్యం ' శీర్షికన శుక్రవారం వార్త ప్రచురితమవడంతో స్పందించిన కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సంబంధిత అధికారులతో మాట్లాడారు.గోకులాల పనులు పూర్తయిన 10రోజుల్లో బిల్లులు అప్‌లోడ్ చేయాలని ఆదేశించారు.ఒక్కో షెడ్డు నిర్మాణానికి రూ.2.30 లక్షల అంచనా వ్యయంతో రూ.62.93 కోట్ల మంజూరుకు ప్రభుత్వం ఆమోదం తెలిపిందన్నారు. పనుల్లో ఎక్కడైనా ఇబ్బందులుంటే తన దృష్టికి తీసుకురావాలన్నారు. ఇప్పటివరకు పూర్తయిన పనులన్నింటికీ ఆన్‌లైన్‌లో మెటీరియల్‌షీట్‌లో అప్‌లోడ్‌చేసి ఎస్టిమేషన్లు సిద్ధం చేయాలని సూచించారు. పూతలపట్టు, చౌడేపల్లె మండలాల్లో జరుగుతున్న ఇరిగేషన్ పనులను ఆరాతీశారు.డ్వామా పీడీ, డీఈలు, ఏఈలు, ఇరిగేషన్ అధికారులు, ఏపీడీవోలు, ఏపీవోలు పాల్గొన్నారు.

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

560 వాహనాల సైలెన్సర్లు, లౌడ్ హారన్లు ధ్వంసం

తిరుపతి(నేరవిభాగం), ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి) : తిరుపతిలో అధిక ధ్వని కాలుష్యం కలిగిస్తూ ఇబ్బందికరంగా తయారైన దాదాపు 560 వాహనాల సైలెన్సర్లు, లౌడ్ హారన్లను శుక్రవారం ధ్వంసం చేశారు. తిరుపతిలోని పోలీసు పరేడ్ మైదానంలో ఎస్పీ హర్షవర్ధనరాజు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం చేపట్టారు. ఇందులో 60 ద్విచక్రవాహనాల సైలెన్సర్లు, మరో 500 వాహనాల లౌడ్ హారన్లు ఉన్నాయి. 1988లోని సెక్షన్ 190(2) ప్రకారం జరిమానాలు విధించినట్లు ఎస్పీ చెప్పారు. వాహనాలకు అమర్చిన అధిక శబ్దం కలిగించే హారన్లు తొలగించాక ఒరిజనల్ హారన్లు, సైలెన్సర్లు బిగించాకనే వాహనాలను యజమానులకు తిరిగిస్తామన్నారు. శబ్ద కాలుష్యంలేని హారన్లు, సైలెన్సర్లు వాడాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ డీఎస్పీ రామకృష్ణమాచారి, సీఐలు సంజీవ్‌కుమార్, ఎస్‌ఐలు పురుషోత్తమ రెడ్డి, విజయలక్ష్మి, సిబ్బంది పాల్గొన్నారు.

జగన్‌కు మహిళలంటే గౌరవం లేదు

టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి సురేంద్ర కుమార్



చిత్తూరు సిటీ, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): మాజీ సీఎం జగన్‌కు మహిళలంటే గౌరవం లేదని టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి సురేంద్ర కుమార్ అన్నారు. శుక్రవారం జిల్లా పార్టీ కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. మహిళా ప్రజాప్రతినిధిని నీచంగా మాట్లాడిన ప్రసన్నకుమార్ రెడ్డిని పరామర్శించేందుకు జగన్ నెల్లూరు వెళ్లడాన్ని రాష్ట్ర మహిళలు అసహ్యించుకుంటున్నారని చెప్పారు. ఒక ప్రజా నాయకుడిగా ఉండాల్సిన లక్షణాలు జగన్‌కు లేవని విమర్శించారు. మాజీ మంత్రి పెద్దిరెడ్డిపై ఉన్న కక్షతో ఆయన కుమారుడు ఎంపీ మిథున్ రెడ్డిపై తప్పుడు కేసు పెట్టారని సీఎం చంద్రబాబుపై ఆరోపణలు చేయడం సమంజసం కాదని అన్నారు. మద్యం కేసులో పక్కా ఆధారాలు ఉండడంతోనే ఈ కేసుకు సంబంధించిన వైసీపీ నేతలు వరుసగా అరెస్టవుతున్నారని స్పష్టం చేశారు. తీర్థయాత్రలు, జైత్రయాత్రలు, దండయాత్రలు, ఓదార్పుయాత్రలను ప్రజలు చూశారని.. జగన్‌రెడ్డి ఇప్పుడు కొత్తగా జైలు యాత్రలు చేస్తూ చరిత్ర సృష్టిస్తున్నారని ఎద్దేవా చేశారు. నెల్లూరు పర్యటనలో ప్రజలు జగన్‌ను ఛీకొట్టారని, జనాలు లేకపోవడంతో బంగారుపాళ్యం పర్యటన వీడియోలను వారి చానల్‌లో ప్రసారం చేసుకున్నారని ఆరోపించారు.

అబార్షన్ కేసుల్లో కారణాలు వెలికితీయండి

వైద్యాధికారులకు కలెక్టర్ ఆదేశం



వైద్యాధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ సుమిత్‌కుమార్

చిత్తూరు కలెక్టరేట్,ఆగస్టు1(ఆంధ్రజ్యోతి):జిల్లాలోని అన్ని ప్రైవేటు, ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఇప్పటివరకు జరిగిన అబార్షన్ కేసులను పరిశీలించి, కారణాలను వెలికితీసి.. నివేదిక ఇవ్వాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని మీటింగ్ హాలులో పీసీ, పీఎన్‌డీటీ చట్టం కింద జిల్లా స్థాయి బహుళ సభ్యుల అప్రూవింగ్ అథారిటీ - సలహా కమిటీ సమావేశం కలెక్టర్ అధ్యక్షతన జరిగింది. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ ఆస్పత్రులు, పీహెచ్‌సీల్లో ఎక్కువశాతం కాన్పులు జరగాలని ఆదేశించారు. ప్రతినెలా 50కాన్పులు ప్రతి పీహెచ్‌సీల్లో నిర్వహించాలన్నారు. ఆర్‌ఎంపీ డాక్టర్లు చట్టనిబంధనల ప్రకారం ప్రసవాలు చేయిస్తుంటే, అలాంటి క్లినిక్‌లను వెంటనే మూతవేయించాలని చెప్పారు. జిల్లాలో ఎక్కడైనా లింగనిర్ధారణ పరీక్షలు, భ్రూణహత్యలకు పాల్పడుతుంటే చట్టపరమైన కేసులు చేయాలన్నారు. డీఎంహెచ్‌వో సుధారాణి, డిప్యూటీ డీఎంహెచ్‌వో వెంకటప్రసాద్, డీసీహెచ్‌ఎస్ పద్మాంజలి, పీపీ, పీఎన్‌డీటీ ఇన్‌చార్జి నోడల్ ఆఫీసర్ అనిల్‌కుమార్, దిశ సీఐ మహేశ్వర్, ఐసీడీఎస్ పీడీ వెంకటేశ్వరి,ఎన్జీవోలు తదితరులుపాల్గొన్నారు.

హౌసింగ్ కాలనీల్లో మౌలిక వసతుల కల్పన

● కలెక్టర్ ఆదేశం

చిత్తూరు కలెక్టరేట్, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): హౌసింగ్ కాలనీల్లో విద్యుత్, రహదారి నిర్మాణాల వంటి మౌలిక వసతుల కల్పన కచ్చితంగా జరగాలని సంబంధిత శాఖల అధికారులను కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని మీటింగ్ హాలులో ఎన్టీఆర్ హౌసింగ్ పురోగతిపై డీఆర్డీఏ పీడీ, మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీవోలతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కలెక్టర్ సమీక్షించారు. మూడు వారాల వ్యవధిలో 217 ఇండ్ల నిర్మాణాలు జరిగాయని, ఈ సంఖ్యను 300కు పెంచాలని ఆదేశించారు. హౌసింగ్ కాలనీల్లో లేఅవుట్లలో సమస్యలు ఉంటే మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీవోలు, తహసీల్దార్లు సమన్వయం చేసుకుని, పరిష్కరించాలన్నారు. అర్హులైన లబ్ధిదారుల సంఖ్యను పెంచాలని, గృహనిర్మాణాల నాణ్యతలో రాజీపడవద్దని సూచించారు. హౌసింగ్ అధికారులు మాట్లాడుతూ ఇప్పటివరకు రూ.137.19 కోట్లతో 6175 ఇండ్ల నిర్మాణాలు పూర్తయ్యాయని, మిగిలినవి వివిధ దశల్లో ఉన్నాయన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో హౌసింగ్ ఈఈ శంకరప్ప పాల్గొన్నారు.

ట్రాఫిక్ కానిస్టేబుల్‌పై ఆటో డ్రైవర్ దాడి

చిత్తూరు అర్బన్, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): ట్రాఫిక్ కానిస్టేబుల్‌పై ఓ ఆటో డ్రైవర్ మద్యం మత్తులో దాడి చేసిన సంఘటన శుక్రవారం సాయంత్రం జరిగింది. సీఐ మహేశ్వర్ తెలిపిన వివరాల మేరకు.. ట్రాఫిక్ కానిస్టేబుల్ చిత్తూరు షర్మన్ పాఠశాల వద్ద శుక్రవారం విధుల్లో ఉన్నారు. ఓ ప్రైవేటు స్కూల్ వ్యాన్, ఆటో ఎదురెదురుగా రావడంతో ఇద్దరు డ్రైవర్లు అరుచుకున్నారు. దీనివల్ల ట్రాఫిక్ స్తంభించింది. ఈ క్రమంలో ట్రాఫిక్ కానిస్టేబుల్ వచ్చి ఆటోను తీయమని డ్రైవర్‌కు సూచించాడు. అప్పటికే మద్యం మత్తులో ఉన్న ఆటోడ్రైవర్ కానిస్టేబుల్‌పై దాడి చేసి వాహనం వదిలి పరారయ్యాడు. పోలీసులు ఆటోను సీజ్ చేసి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అభివృద్ధిని చూసి టీడీపీలోకి చేరికలు



టీడీపీలో చేరిన కుటుంబాలతో ఎమ్మెల్సీ కంచర్ల, పీఎస్ఎం తదితరులు

కుప్పం, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబు కుప్పంలో చేస్తున్న అభివృద్ధి పనులు, కుటుంబాలకు అందిస్తున్న సంక్షేమ ఫలాలు చూసి ఆయనపై ప్రేమతో పలువురు తెలుగుదేశం పార్టీలో చేరుతున్నారని ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, ఆర్టీసీ వైస్ చైర్మన్ పీఎస్.మునిరత్నం అన్నారు. కుప్పం పురపాలక సంఘం కొత్తపేట పార్టీ యూనిట్ ఇన్‌చార్జి అప్పు ముఖేశ్ ఆధ్వర్యంలో శుక్రవారం 67 కుటుంబాలు వైసీపీని వీడి టీడీపీలో చేరాయి. ఈ సందర్భంగా జరిగిన సభకు ముఖ్య అతిథులుగా హాజరైన ఎమ్మెల్సీ, పీఎస్ఎంలు మాట్లాడుతూ టీడీపీ కంచుకోటగా ఉన్న కుప్పంలో ఇప్పటికీ అదే ఆదరాభిమానాలు పార్టీపై వ్యక్తమవుతున్నాయన్నారు. ఇక్కడి ప్రజలు తమపై చూపుతున్న ఆదరణకు రెట్టింపు స్థాయిలో ముఖ్యమంత్రి చంద్రబాబు వారిపై అభిమానం పెట్టుకున్నారన్నారు. అందుకే అభివృద్ధిని పరుగులు పెట్టిస్తున్నారని చెప్పారు. రాబోయే ఆరు నెలల్లో రోడ్లు, కాలువలతో పాటు అనేక అభివృద్ధి పనులతో కొత్తపేట రూపురేఖలు మారుతాయని హామీ ఇచ్చారు. పార్టీ అభివృద్ధికి చొరవ చూపుతున్న అప్పు ముఖేశ్‌ను అభినందించారు. కుప్పం మున్సిపల్ టీడీపీ అధ్యక్షుడు రాజ్‌కుమార్, సీనియర్ నాయకులు గోపీనాథ్, మాజీ మున్సిపల్ చైర్మన్ డాక్టర్ సుధీర్, క్లస్టర్ ఇన్‌చార్జి కన్నన్, మంజునాథ్, కొత్తపేట యూనిట్ ఇన్‌చార్జి అప్పు ముఖేశ్, టీఎన్ఎస్ఎఫ్ నాయకుడు మునియప్ప, మహేంద్ర, తిరుమగళ్, మురళి, లోకేశ్, సుకుమార్, బూత్ ఇన్‌చార్జిలు కృష్ణ, రాహుల్, సురేశ్ పాల్గొన్నారు.

నూతన పెన్షనర్లకు సన్మానం



సన్మానం అందుకున్న నూతన పెన్షనర్లతో ప్రేమ్‌కుమార్ తదితరులు

కుప్పం రూరల్, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): కుప్పం మండలంలో నూతనంగా పెన్షన్లు మంజూరైన లబ్ధిదారులకు మండలంలోని మల్లానూరులో శుక్రవారం టీడీపీ మండలాధ్యక్షుడు ప్రేమ్‌కుమార్ ఆధ్వర్యంలో సన్మానం చేశారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం పేదల సేవలో తరిస్తుందన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు రమ్య, బాలకృష్ణ, సచివాలయ సిబ్బంది, స్థానిక పార్టీ నాయకులు రమేశ్, దామోదర్, విభూషణ్, అన్నాదొరై, నాగార్జున, రాజ్ కుమార్, చంద్ర, జయప్రకాశ్, సుభాష్, కళైసెల్వం పాల్గొన్నారు.

అక్రమ రవాణాకు పాల్పడితే కఠిన చర్యలు

శాంతిపురం, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): మండలంలో అక్రమ రవాణాకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని రాళ్లబూదుగూరు ఎస్ఐ నరేష్ తెలిపారు. శుక్రవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ అక్రమ క్వారీ చేపట్టి వాటి దిమ్మెలను ఎలాంటి అనుమతులు లేకుండా తరలిస్తే అలాంటి వాహనాలను సీజ్ చేస్తామన్నారు. అలాగే ట్రాక్టర్లతో సైజ్ రాళ్లు తరలించేటప్పుడు ట్రాక్టర్ యజమాని సరైన ఆధారాలు తీసుకోవాలన్నారు. చెరువుల్లో మట్టి , ఇసుక అక్రమ రవాణా చేపట్టినా, ఆంధ్ర, తమిళనాడు బియ్యం అక్రమంగా తరలించినా కేసులు నమోదు చేసి కఠినంగా శిక్షిస్తామన్నారు. సక్రమంగా రికార్డులు ఉన్న వాహనాలకు మాత్రమే అనుమతులు ఉంటాయన్నారు. వ్యాపారులు పైన తెలిపిన వివరాలను గమనిస్తూ నడుచుకోవాలని ఎస్ఐ తెలిపారు.

వాహనాల తనిఖీ



వాహనాల రికార్డులు తనిఖీ చేస్తున్న ఆర్టీవో మధుసూదన్

పలమనేరు, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): పలమనేరు వాహనాల తనిఖీ అధికారి మధుసూదన్ శుక్రవారం జాతీయ రహదారిపై వాహనాల రికార్డులను ఆకస్మికంగా తనిఖీ చేశారు. జాతీయ రహదారిపై పలమనేరు సమీపంలోని బొమ్మిదొడ్డి క్రాస్ వద్ద వాహనాలను ఆపారు. ఈ సందర్భంగా వాహన రికార్డులు, డ్రైవర్ లైసెన్సులను పరిశీలించారు. నిబంధనలు పాటించని వాహనదారులకు జరిమానాలు విధించారు.

బిడ్డకు తల్లిపాలే శ్రేష్టం



పలమనేరు: రంగాపురంలో మాట్లాడుతున్న సూపర్‌వైజర్ నజ్మా

పలమనేరు, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): పుట్టినబిడ్డకు తల్లిపాలు ఒక టీకాలా పనిచేస్తుందని, ప్రతిబిడ్డకు తల్లిపాలే అత్యంత శ్రేష్ఠకరమని అంగన్‌వాడీ సూపర్‌వైజర్ నజ్మా అన్నారు. శుక్రవారం పలమనేరు రంగాపురం అంగన్‌వాడీ కేంద్రంలో తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో ఏఎన్ఎం, అంగన్‌వాడీ కార్యకర్త చిలకమ్మ, హెల్పర్ పరిమళ, ఆశావర్కర్లు, తల్లులు పాల్గొన్నారు

● **రొంపిచెర్ల:** రొంపిచెర్ల బలిజవీధిలోని అంగన్వాడీ కేంద్రంలో శుక్రవారం తల్లిపాలు వారోత్సవాలు చేపట్టారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ హెచ్ఈ రాజేశ్వరి, సీహెచ్‌వో అమ్మాని, సూపర్‌వైజర్ పంకజ, సితారా, ఆరోగ్య, ఆశ కార్యకర్తలు షాహీనా, లత పాల్గొన్నారు.

టీడీపీలోకి రామకుప్పం వైసీపీ నాయకులు



నాగరాజనాయక్‌ను పార్టీలోకి ఆహ్వానిస్తున్న మునిరత్నం, సురేష్‌బాబు

రామకుప్పం, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): రామకుప్పం మండలం ననియాలకు చెందిన వైసీపీ నేత నాగరాజనాయక్ టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. శుక్రవారం రామకుప్పం టీడీపీ కార్యాలయంలో ఆర్టీసీ వైస్‌చైర్మన్ మునిరత్నం, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి సురేష్ బాబు ఆయనకు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో టీడీపీ ఎస్సీసెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మునస్వామి, బీసీసెల్ కార్యనిర్వాహక కార్యదర్శి పత్ర నారాయణాచారి, పార్టీ మండధ్యక్షుడు ఆనందరెడ్డి, మాజీ అధ్యక్షుడు అంజనేయరెడ్డి, నేతలు రామ్మూర్తి, గుర్రప్ప, కృష్ణానాయక్, మహ్మద్‌రఫీ, నరసింహులు, కామరాజనాయక్, మనోహర్, కుమార్, మునిరాజనాయక్ పాల్గొన్నారు.

రహదారి పనులు పూర్తిచేయాలని మంత్రికి వినతి

బైరెడ్డిపల్లె, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): మండలంలో అసంపూర్తిగా ఉన్న రహదారి పనులను పూర్తిచేయాలని పలువురు శుక్రవారం బైరెడ్డిపల్లె పర్యటనకు విచ్చేసిన మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి, పలమనేరు ఎమ్మెల్యే అమరనాథరెడ్డిలకు విన్నవించారు. ఏళ్లగా అసంపూర్తిగా గుంతలమయమై, కంకర తేలి అవస్థలు పడుతున్న కైగల్- రామసముద్రం మార్గంలో తారురోడ్డు పనులు పూర్తిచేయాలని, అలాగే ఆలప్పల్లె రహదారి, గుంతలమయంగా ఉన్న బైరెడ్డిపల్లె నుంచి కడపనత్తం వెళ్లే రహదారి పనులు చేపట్టాలని ప్రజలు, నాయకులు వినతిపత్రాలు అందజేశారు.

సోమల విద్యాశాఖాధికారిగా విజయకుమారి

సోమల, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): సోమల ఎంఈవో-1 గా విజయకుమారి శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేస్తున్న కేశవరెడ్డి చౌడేపల్లె ఎంఈవోగా పూర్తి స్థాయిలో పనిచేయనున్నారు. ఆయన సోమలలో ఇన్‌చార్జిగా పనిచేసేవారు. ఈక్రమంలో పలువురు ఉపాధ్యాయులు ఎంఈవోను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. సీఆర్పీలతో సమావేశం నిర్వహించారు.

సూరయ్యగారిపల్లె ఉన్నత పాఠశాల తనిఖీ



ఎంఈవో లోకేశ్వరరెడ్డిని సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

సోమల, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సూరయ్యగారిపల్లె ఉన్నత పాఠశాలను శుక్రవారం మదనపల్లె ఉప విద్యాశాఖాధికారి లోకేశ్వరరెడ్డి ఆకస్మికంగా తనిఖీ చేశారు. పదో తరగతి విద్యార్థుల సామర్థ్యాలను పరీక్షించారు. పబ్లిక్ పరీక్షల్లో మంచి ఫలితాలు సాధించాలన్నారు. మధ్యాహ్న భోజన నిర్వాహకులకు, ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో హెచ్ఎం శిరీష, పీడీ. శివకుమార్, చంద్రకళ, రాజేశ్, ఏవీ. రెడ్డి, షర్మిళా భాను, కుసుమ తదితరులు పాల్గొన్నారు.

అక్రమ లేఅవుట్లను వెంటనే రెగ్యులరైజ్ చేసుకోవాలి

పలమనేరు, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): అక్రమ లేఅవుట్ల క్రమబద్ధీకరణ కోసం ప్రభుత్వం ఇచ్చిన గడువు త్వరలోనే ముగుస్తున్నందున రియల్టర్లు వెంటనే వారి లేఅవుట్లను క్రమబద్ధీకరించుకోవాలని పలమనేరు మున్సిపల్ కమిషనర్ ఎస్.వి.రమణారెడ్డి సూచించారు. పలమనేరులో మూడు మినహా మిగిలిన దాదాపు 34 లేఅవుట్లు అక్రమ లే అవుట్లుగా గుర్తించామన్నారు. ప్రభుత్వం అక్రమ లేఅవుట్ల క్రమబద్ధీకరణకు ఈ ఏడాది జూన్ 1 నుంచి 90 రోజుల పాటు అవకాశం కల్పించిందన్నారు. రెండు నెలలు గడిచిపోయిందని.. అక్రమ లే అవుట్లు వేసిన రియల్టర్లు నిబంధనల మేరకు ఫీజులు చెల్లించి క్రమబద్ధీకరణ చేసుకోవాలని సూచించారు.

బోయకొండ గంగమ్మకు రాహుకాలాభిషేకాలు



ప్రత్యేకాలంకరణలో బోయకొండ గంగమ్మ

చౌడేపల్లె, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ పుణ్యక్షేత్రమైన బోయకొండ గంగమ్మ ఆలయంలో శుక్రవారం శాస్త్రోక్తంగా రాహుకాలాభిషేకాలు నిర్వహించారు. అమ్మవారికి ప్రీతి కరమైన రాహుకాలంలో పసుపు, కుంకుమ, గంధం, పంచామృతాలతో అభిషేకాలు చేపట్టారు. అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. శుక్రవారం కావటంతో భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. భక్తులు రాహుకాల పూజలో పాల్గొని తీర్థప్రసాదాలు అందుకున్నారు. ఆలయ ఈవో ఏకాంబరం భక్తులకు అన్నదానం ఏర్పాట్లు పర్యవేక్షించారు.

లక్ష్మీనారాయణ మృతికి నివాళులు

గుడుపల్లె, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): ద్రావిడ విశ్వవిద్యాలయ మాజీ వీసీ ఆచార్య గంగిశెట్టి లక్ష్మీనారాయణ మృతి తెలుగు సాహిత్య లోకానికి తీరని లోటని ఇన్‌చార్జి వీసీ దొరస్వామి పేర్కొన్నారు. శుక్రవారం ద్రావిడ వర్సిటీలో మాజీ లక్ష్మీ నారాయణ మృతికి సంతాపంగా ఎన్టీఆర్ విగ్రహం ఎదుట సంతాప సభ నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి రిజిస్ట్రార్ కిరణ్ కుమార్, అధ్యాపకులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

బుంగావారిపల్లెలో పాలేటమ్మ విహారం



ఊరేగుతున్న పాలేటమ్మ

సోమల, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నెల్లిమందలో కొలువుదీరిన పాలేటమ్మ జాతర సందర్భంగా గ్రామోత్సవాల్లో భాగంగా శుక్రవారం బుంగావారిపల్లె, అడుసుపల్లె, గుంతచెర్వుపల్లెలో అమ్మవారి ఉత్సవమూర్తిని ఊరేగించారు. ఈక్రమంలో మహిళలు ఇంటింటా అమ్మవారికి పూజలు చేపట్టారు. పోతురాజు విన్యాసాలు భక్తులను ఆకట్టుకున్నాయి. ఉభయదారులు శెట్టివారి సదాశివయ్య, భాస్కర్ కుటుంబసభ్యులు భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి



గౌతం మృతదేహం

కుప్పం, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): కుప్పం పట్టణంలోని టీడీపీ కార్యాలయం ఎదురుగా బైపాస్ రోడ్డులో శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతి చెందగా మరో యువకుడు తీవ్ర గాయాలతో ఆస్పత్రి పాలయ్యాడు. స్థానికుల కథనం మేరకు .. కుప్పం పురపాలక సంఘం చప్పిడి గురుగులు ప్రాంతానికి చెందిన యువకులు గౌతం (23), అహ్మద్ సొంత పనిపై శుక్రవారం ఉదయం కుప్పం వచ్చారు. పనిచూసుకుని చప్పిడిగురుగులుకు ద్విచక్ర వాహనంపై తిరుగు ప్రయాణమయ్యారు. కుప్పం ఆర్టీసీ బస్టాండు వైపునుంచి బైపాస్ రోడ్డులోకి ప్రవేశించే సమయంలో ఫ్లై ఓవర్‌నుంచి వేగంగా దూసుకొస్తున్న లారీని గమనించకపోడంతో అది ద్విచక్ర వాహనాన్ని ఢీకొంది. లారీని ఎదురుగా వస్తున్న మరో లారీ ఢీకొంది. ప్రమాదంలో గౌతం అక్కడికక్కడే మృతి చెందాడు. తీవ్ర గాయాలపాలైన అహ్మద్‌ను చికిత్స నిమిత్తం పీఈఎస్ ఆస్పత్రికి తరలించారు. అతని పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలిసింది. దీనిపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

వైష్ణవిదేవికి శ్రావణ మాస పూజలు

చౌడేపల్లె, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): పుదిపట్లలో వెలసిన వైష్ణవి దేవికి శ్రావణ మాస శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయాన్నే అమ్మవారికి పంచామృతాభిషేకాలు నిర్వహించి ప్రత్యేకంగా అలంకరించారు. భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ నిర్వాహకులు వినోద్‌కుమార్‌రెడ్డి, శ్రావణి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

అలరించిన కీచకవధ ఘట్టం

సోమల, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): కందూరులో జరుగుతున్న మహాభారత యజ్ఞం సందర్భంగా శుక్రవారం కీచకవధ ఘట్టాన్ని తిలకించడానికి అధిక సంఖ్యలో భక్తులు తరలి వచ్చారు. ఈక్రమంలోనే పంచపాండవ విగ్రహాలకు ఆలయ ధర్మకర్త పి.శ్రీనివాసులు అభిషేక పూజలు చేశారు.

చంద్రబాబు కుప్పం ఎమ్మెల్యే కావడం అదృష్టం



కుప్పం: పింఛన్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్సీ కంచర్ల, పీఎస్ఎం తదితరులు



రొంపిచెర్ల: బొమ్మయ్యగారిపల్లెలో పింఛన్లు పంపిణీ చేస్తున్న చల్లా రామచంద్రారెడ్డి



శాంతిపురం: కెనమాకులపల్లెలో పింఛన్లు పంపిణీ చేస్తున్న టీడీపీ నేతలు

కుప్పం, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబు స్థానిక ఎమ్మెల్యే కావడం, ఆయన తన కార్యక్షేత్రంగా ఈ కుప్పం నియోజకవర్గాన్ని ఎంచుకోవడం ఇక్కడి ప్రజలకు పట్టిన అదృష్టమని ఎమ్మెల్సీ, ప్రభుత్వ విప్ కంచర్ల శ్రీకాంత్, ఏపీఎస్ ఆర్టీసీ వైస్ చైర్మన్ పీఎస్.మునిరత్నం అన్నారు. కుప్పం పురపాలక సంఘం పరిధిలో నూతనగా మంజూరైన సామాజిక పింఛన్లను వారు మున్సిపల్ చైర్మన్ సెల్వరాజ్, కమిషనర్ వి.శ్రీనివాసరావు, టీడీపీ మున్సిపల్ అధ్యక్షుడు రాజ్‌కుమార్‌లతో కలిసి శుక్రవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ, పీఎస్ఎంలు మాట్లాడుతూ గతంలో జరిగిన అభివృద్ధికి మించి ఈ ఐదేళ్ల టీడీపీ పాలనాకాలంలో కుప్పంలో జరిగి తీరుతుందన్నారు. ముఖ్యమంత్రి అందుకోసం తగిన ప్రణాళికలు కడా ద్వారా తయారు చేయిస్తున్నారని, ఇందుకోసం ఐఏఎస్ ఆఫీసర్‌ను పీడీగా నియమించారని చెప్పారు. ఇటీవలే రూ.22 కోట్లతో ఎన్టీఆర్ స్పోర్ట్స్ స్టేడియం అభివృద్ధి పనులకు భూమి పూజ చేసిన విషయం గుర్తు చేశారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు, టీడీపీ నాయకులు, అధికారులు, పింఛనుదారులు పాల్గొన్నారు.

● **కుప్పం:** కుప్పం పురపాలక సంఘంలో శుక్రవారం పింఛన్ల పంపిణీ జోరుగా సాగింది. ఆర్టీసీ వైస్ చైర్మన్ పీఎస్.మునిరత్నం, టీడీపీ మున్సిపల్ అధ్యక్షుడు రాజ్‌కుమార్, వార్డు కౌన్సిలర్లు మున్సిపల్ ఉద్యోగులు, నాయకులతో కలిసి ఇంటింటికీ వెళ్లి లబ్ధిదారులకు పింఛన్లు పంపిణీ చేశారు. మల్లానూరులో టీడీపీ రూరల్ అధ్యక్షుడు ప్రేమ్‌కుమార్ పాల్గొన్నారు.

● **శాంతిపురం:** పేదల సంక్షేమమే ముఖ్యమంత్రి నారా చంద్రబాబు లక్ష్యమని టీడీపీ మండలాధ్యక్షులు అధ్యక్షుడు భాష్యం విశ్వనాథ నాయుడు, మాజీ వైస్ ఎంపీపీ నందిగం ఉదయకుమార్‌నాయుడు అన్నారు. శుక్రవారం కెనమాకులపల్లె గ్రామంలో టీడీపీ నేతలతో కలిసి పింఛన్లు పంపిణీ చేశారు. యూనిట్ ఇన్‌చార్జి జయారెడ్డి, కేదరనాథ్, రమేష్, రాజారెడ్డి, శివకుమార్, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

● **సోమల:** కందూరు, ఇరికిపెంట గ్రామాల్లో శుక్రవారం కొత్తగా మంజూరైన పింఛన్లు పంపిణీ చేశారు. టీడీపీ మండలాధ్యక్షుడు సుబ్రహ్మణ్యం నాయుడు, ఏఎంసీ చైర్మన్ శ్రీనివాసులు నాయుడు, నాయకులు శివశంకర్, బోస్, శ్రీనివాసులు, చంద్రశేఖర్ నాయుడు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

● **రామకుప్పం:** మండల పరిధి నారాయణ పురంతాండా, మిట్టపల్లె, రామకుప్పంలో కొత్త లబ్ధిదారులకు శుక్రవారం పింఛన్లు పంపిణీ చేశారు. టీడీపీ మండలాధ్యక్షుడు ఆనందరెడ్డి, మాజీ అధ్యక్షుడు ఆంజనేయరెడ్డి, ఏఎంసీ మాజీ వైస్‌చైర్మన్ సీతాపతి తదితరులు పాల్గొన్నారు.

● **చౌడేపల్లె:** మండలంలో శుక్రవారం సాయంత్రానికి 95 శాతం పింఛన్లు పంపిణీ చేసినట్లు ఎంపీడీవో లీలామాధవి తెలిపారు. మండలంలో 6,556 మందికి గాను 6,209 మందికి ఒక్కరోజులోనే పంపిణీ చేసినట్లు పేర్కొన్నారు.

● **రొంపిచెర్ల:** పుంగనూరు నియోజకవర్గం టీడీపీ ఇన్‌చార్జి చల్లా రామచంద్రారెడ్డి శుక్రవారం రొంపిచెర్ల మండలం బొమ్మయ్యగారిపల్లె గ్రామంలో నూతనంగా మంజూరైన పింఛన్లను పంపిణీ చేశారు. ఎంపీడీవో మధుసూదన్‌రెడ్డి , పంచాయతీ కార్యదర్శి హరిబాబు, టీడీపీ నాయకులు నాగరాజ, సురేంద్ర పాల్గొన్నారు.

మణీంద్రం ఎంపీటీసీగా టీడీపీ అభ్యర్థిని గెలిపించాలి



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న మునిరత్నం

రామకుప్పం, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): ఈనెల 12న జరుగనున్న రామకుప్పం మండలం మణీంద్రం ఎంపీటీసీ ఉప ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థిని మెజారిటీతో గెలిపించాలని ఆర్టీసీ వైస్‌చైర్మన్ మునిరత్నం, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి డా.సురేష్‌బాబు ఓటర్లను కోరారు. శుక్రవారం రామకుప్పం టీడీపీ కార్యాలయంలో మీడియా సమావేశం నిర్వహించారు. సీఎం చంద్రబాబు గ్రామాల్లో అభివృద్ధి పనులను శరవేగంగా చేపడుతున్నారని.. ప్రతి ఓటరూ టీడీపీ అభ్యర్థికి ఓటు వేయాలని ఆయన కోరారు. ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాలను ప్రతిఓటరుకు వివరించాలని సూచించారు. మణీంద్రం ఎంపీటీసీగా భారీ మెజారిటీతో గెలిపించి సీఎం చంద్రబాబుకు కానుకగా ఇవ్వాలని పిలుపునిచ్చారు. సమావేశంలో టీడీపీ ఎస్సీసెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మునస్వామి, బీసీసెల్ కార్యనిర్వాహక కార్యదర్శి పత్ర నారాయణాచారి, పార్టీ మండలాధ్యక్షుడు ఆనందరెడ్డి, మాజీ అధ్యక్షుడు ఆంజనేయరెడ్డి, నేతలు రామ్మూర్తి, గుర్రప్ప, కృష్ణానాయక్, మహ్మద్‌రఫీ, నరసింహులు, జేయి, జ్ఞానశేఖర్‌రెడ్డి, రామలింగారెడ్డి, రఘు, భూపతి, బాబురెడ్డి, విశ్వనాథరెడ్డి, పద్మమ్మ, అలివేలు మంగమ్మ, రాణెమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే అమరనాథరెడ్డికి సన్మానం



ఎమ్మెల్యే అమరనాథరెడ్డిని సన్మానిస్తున్న సింగిల్ విండో చైర్మన్లు

వి.కోట, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): పలమనేరు ఎమ్మెల్యే అమరనాథరెడ్డిని వి.కోట, ముదరందొడ్డి సింగిల్ విండో అధ్యక్షులు నారాయణస్వామి, హరినాథరెడ్డి శుక్రవారం ఘనంగా సన్మానించారు. పలమనేరు క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యేను కలిసి గజమాలతో సత్కరించారు. మండల పార్టీ అధ్యక్షులు రంగనాథ్, నాయకులు రామచంద్రనాయుడు, రాంబాబు, ఈశ్వర్, ధీరజ్, శబరీష్, నాగరాజ్, రుహుల్లా, సతీష్, జనార్దన్‌రెడ్డి, గౌస్‌పీర్, కోదండ తదితరులు పాల్గొన్నారు.

మృతదేహం అప్పగించలేదని ధర్నా



ధర్నా చేస్తున్న మృతుడి కుటుంబ సభ్యులు

బైరెడ్డిపల్లె, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బేలుపల్లె గ్రామానికి చెందిన యువకుడు భాస్కర్ (25) రెండురోజుల క్రితం నెల్లూరు జిల్లాలో జరిగిన రోడ్డుప్రమాదంలో మృతిచెందాడని, మృతదేహాన్ని ఇప్పటివరకు అప్పగించలేదని శుక్రవారం కుటుంబ సభ్యులు, గ్రామస్తులు, దళిత సంఘాలతో కలసి పలమనేరు - కుప్పం రహదారిపై ధర్నా చేశారు. పోలీసులు చేరుకుని సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని వారికి నచ్చజెప్పి పంపారు.

ఎంఈవో పోస్టులు జడ్పీకి ఇవ్వాలంటూ నిరసన



నిరసన తెలుపుతున్న ఉపాధ్యాయులు

పుంగనూరు, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): మండల విద్యాశాఖాధికారుల (ఎంఈవో) పోస్టులు జిల్లా పరిషత్ యాజమాన్యాలకు ఇవ్వాలని ఉపాధ్యాయులు పుంగనూరులో నల్లరిబ్బన్లు ధరించి నిరసన వ్యక్తం చేశారు. శుక్రవారం మధ్యాహ్నం భోజన విరామ సమయంలో స్థానిక జడ్పీ బాలికోన్నత పాఠశాలలో ఉపాధ్యాయులు నిరసన తెలిపారు. కార్యక్రమంలో హెచ్ఎం రుద్రాణి, పీఆర్టీయూ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు జీవీ.రమణ, టీచర్లు చంద్రశేఖర్, రామకృష్ణ, జీవలత, చాముండేశ్వరి, సుగుణమ్మ, రెడ్డిరాజేశ్వరి, అరుణ, వనజ, తులసి, మీనా, శైలజ, పద్మావతి, అనిత, గాయిత్రి, జ్యోతి, తనూజ తదితరులు పాల్గొన్నారు.

సీఎం చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం



చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న టీడీపీ నాయకులు

కల్లూరు, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): పులిచెర్ల మండలం ఎల్లంకివారిపల్లిలో శుక్రవారం పింఛన్ల మంజూరుపై టీడీపీ నాయకులు సీఎం చంద్రబాబునాయుడు చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వం స్పౌజ్ కేటగిరీలో మండలానికి నూతనంగా 98 వితంతు పింఛన్లు మంజూరు చేయడంపై టీడీపీ నాయకులు, కార్యకర్తలు సంబరాలు చేసుకున్నారు. సింగిల్ విండో అధ్యక్షులు ధనంజయనాయుడు, ఎంపీటీసీ మునికృష్ణమనాయుడు, నాయకులు గోపినాయుడు, దేవ, జయచంద్రనాయుడు, పరందామనాయుడు పాల్గొన్నారు.

3న కుప్పం నుంచి రాజ్యాంగ పరిరక్షణ పాదయాత్ర



నల్లబ్యాడ్జీలతో నిరసన తెలుపుతున్న మాల జేఏసీ నాయకులు

పుంగనూరు రూరల్, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా ఈనెల మూడో తేదీన కుప్పం నుంచి ఇచ్ఛాపురం వరకు రాజ్యాంగ పరిరక్షణ పాదయాత్రను మాలల ఉద్యోగ సంక్షేమ సంఘం, జేఏసీ నేతలు ప్రారంభిస్తారని నాయకులు మాణిక్యాల శేషాద్రి, కేసీ మహానంది తెలిపారు. శుక్రవారం స్థానిక అంబేడ్కర్ విగ్రహం ఎదుట వారు నల్లరిబ్బన్లతో నిరసన వ్యక్తం చేశారు. పాదయాత్రలో ప్రతి మాల కులస్థుడు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు అంజప్ప, బాలు, గణేశ్, నరసింహులు, ఓబులేశ్, రెడ్డెప్ప తదితరులు పాల్గొన్నారు.

జ్ఞాన సరస్వతీదేవికి విశేష పూజలు



జ్ఞాన సరస్వతీదేవికి పూజలు నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు , విద్యార్థులు

కల్లూరు, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): పులిచెర్ల మండలం కల్లూరు జడ్పీ ఉన్నత పాఠశాలలో కొలువైన జ్ఞాన సరస్వతీదేవి ఆలయంలో శుక్రవారం విశేష పూజలు నిర్వహించారు. ఆలయంలో ఉదయం అమ్మవారికి అభిషేకాలు, అర్చనలు చేపట్టారు. అమ్మవారు భక్తులకు విశేషంగా దర్శనమిచ్చారు. ఆలయానికి విచ్చేసిన భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

నేడు రొంపిచెర్లకు మంత్రి రాంప్రసాద్‌రెడ్డి రాక

పుంగనూరు, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తలపెట్టిన అన్నదాత సుఖీభవ కార్యక్రమంలో పాల్గొనేందుకు శనివారం ఉదయం జిల్లా ఇన్‌చార్జి మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి రొంపిచెర్లకు వస్తున్నట్లు టీడీపీ ఇన్‌చార్జి చల్లా రామచంద్రారెడ్డి తెలిపారు. రొంపిచెర్ల ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో జరిగే అన్నదాత సుఖీభవ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొంటారని, రైతులు, నియోజకవర్గంలోని టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

'పిల్లలను మాఊరి బడికైతేనే పంపుతాం'

పుంగనూరు రూరల్, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారిపై నడచి దాదాపు నాలుగు కిలోమీటర్ల దూరంలో ఉన్న పక్కగ్రామానికి కాకుండా మాఊరిలో ఉన్న పాఠశాలకైతేనే మా పిల్లలను పంపుతామని విద్యార్థుల తల్లిదండ్రులు మదనపల్లె డీవైఈవో లోకేశ్వరరెడ్డికి చెప్పారు. శుక్రవారం పుంగనూరు మండలం గుడిసెబండ గ్రామస్తులు రాష్ట్ర విద్యాశాఖ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయడంతో డీవైఈవో విచారణకు వచ్చారు. గ్రామస్తులు స్థానిక ప్రాథమిక పాఠశాల వద్ద ఆయనతో మాట్లాడారు. గూడూరుపల్లె పాఠశాలకు పిల్లలను పంపమన్నారు. రాష్ట్ర విద్యాశాఖ అధికారుల దృష్టికి తీసుకెళతానని డీవైఈవో చెప్పారు. ఎంఈవోలు నటరాజరెడ్డి, రెడ్డెన్నశెట్టి పాల్గొన్నారు.

ఎండోమెంట్ స్థలంలో దుకాణాల తొలగింపు



చిత్తూరు అర్బన్, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): హైరోడ్డు విస్తరణలో భాగంగా శుక్రవారం కట్టమంచి వద్ద ఉన్న ఎండోమెంట్ స్థలంలో నిర్మించిన దుకాణాల తొలగింపు చేపట్టారు. వంద అడుగుల రోడ్డుకు అవసరమైన స్థలాన్ని సేకరించారు. ఎక్స్‌కవేటర్ల సాయంతో చేసిన ఈ పనులను ఏసీపీ నాగేంద్ర పర్యవేక్షించారు. టౌన్‌ప్లానింగ్ సూపర్‌వైజర్ బాలాజి, ప్రణాళిక విభాగం అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

వాటర్ ప్లాంటు పరిశీలన


వనదుర్గాపురంలో వాటర్‌ప్లాంటును పరిశీలిస్తున్న జడ్పీ సీఈవో రవికుమార్ నాయుడు

పాలసముద్రం, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): వనదుర్గాపురంలో దాతల సాయంతో ఏర్పాటు చేసిన ప్లాంటును జడ్పీ సీఈవో రవికుమార్ నాయుడు శుక్రవారం పరిశీలించారు. దాతల సాయంతో ఎంపీపీ శ్యామలా శివప్రకాష్‌రాజు 13 పంచాయతీల్లో 16 వాటర్ ప్లాంట్లు ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. కృష్ణజమ్మాపురంలోని ఇందిరానగర్‌వాసులకు తాగునీటి కోసం అదనపు బోరు మంజూరు చేస్తామని తెలిపారు. వెంగళ్రాజుకుప్పం పంచాయతీ గుట్టమీదిళ్ల కాలనీవాసులు తమకు మినరల్ వాటర్‌ప్లాంటు కావాలని కోరారు. ఇన్‌చార్జి ఎంపీడీవో విద్యావతి, డిప్యూటి ఎంపీడీవో సత్యనారాయణ, కార్యదర్శి జయశంకర్, నాగభూషణం పాల్గొన్నారు.

ఐరాల హైస్కూల్ వజ్రోత్సవాలకు ఆహ్వానం

ఐరాల, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): ఐరాల ప్రభుత్వ ఉన్నత పాఠశాల వజ్రోత్సవాలకు విచ్చేయాలని శుక్రవారం పీహెచ్‌సీ డాక్టర్ రెడ్డెప్పను పూర్వ విద్యార్థుల సంఘం అధ్యక్షుడు సీతాపతినాయుడు కోరారు. కార్యక్రమంలో భాగంగా ఆదివారం ఉచిత ఆరోగ్య శిబిరాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు.

ఇళ్ల నిర్మాణాల్లో పురోగతి సాధించాలి: కమిషనర్

చిత్తూరు అర్బన్, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): నగరపాలక సంస్థ పరిధిలో ఎన్టీఆర్ హౌసింగ్ గృహ నిర్మాణ పనుల్లో పురోగతి సాధించాలని నగరపాలక సంస్థ కమిషనర్ నరసింహ ప్రసాద్ ఆదేశించారు. శుక్రవారం సంస్థ కార్యాలయంలో ఎన్టీఆర్ గృహ నిర్మాణాలపై హౌసింగ్ ఏఈ శ్రీధర్, ఏఈ లోకేష్, అమినిటీ కార్యదర్శులతో సమీక్షించారు. వివిధ దశల్లో ఉన్న గృహాలను లబ్దిదారులు, కాంట్రాక్టర్లతో మాట్లాడి వేగంగా జరిగేలా చూడాలన్నారు. అమినిటీ అధికారులు లే అవుట్లలో పర్యటించి వారాంతపు లక్ష్యాలను పూర్తి చేయాలన్నారు.

కుప్పం ఘటనపై న్యాయవాదుల నిరసన

నగరి, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): కుప్పం ఘటనకు నిరసనగా నగరి ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ కోర్టులో శుక్రవారం నగరి బార్ అసోసియేషన్ సభ్యులు విధులను బహిష్కరించారు. బార్ అసోసియేషన్‌లో సభ్యత్వం కోసం నకిలీ సర్టిఫికెట్లతో వచ్చిన వ్యక్తిని వెంటనే అరెస్టు చేయాలని నినాదాలు చేశారు. అసోసియేషన్ అధ్యక్షుడు వేలాయుధం, కార్యదర్శి జాన్‌జోష్, పలువురు న్యాయవాదులు పాల్గొన్నారు.

4న దుకాణాలకు వేలం

చిత్తూరు కల్చరల్, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): దేవదాయశాఖ ఆధ్వర్యంలోని ఓంకార భవనంలోని దుకాణాలకు ఈనెల 4వ తేదీన బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు ఈవో వెంకటరాయలు తెలిపారు. మూడేళ్ల కాలపరిమితితో ఈ దుకాణాలకు వేలం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. అలాగే నీవానది ఒడ్డున ఉన్న కాశీ విశ్వేశ్వర(రాజుగుడి) ఆలయంలో పూజా సామగ్రి విక్రయించే హక్కుకు కూడా ఈనెల 4వ తేదీన వేలం నిర్వహిస్తున్నామని ఈవో తెలియజేశారు.

షికారి కాలనీలో మౌలిక వసతులు కల్పించాలి: జేసీ

యాదమరి, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): కీనాటంపల్లె పంచాయతీ షికారికాలనీలో మౌలిక వసతులు కల్పించాలని, అవసరమైన ప్రణాళిక సిద్ధం చేయాలని జేసీ విద్యాధరి ఆదేశించారు. శుక్రవారం తహసీల్దార్ కార్యాలయంలో ఈ అంశంపై తహసీల్దార్ పార్థసారథి, ఎంపీడీవో వేణు, సిబ్బందితో సమీక్షించారు. ఎస్సీ, ఎస్టీ కాలనీల్లో హౌస్ హోల్డ్ సర్వే ప్రకారం మౌలిక సదుపాయాల కల్పనకు రెవెన్యూ, పంచాయతీ అధికారులు చర్యలు తీసుకోవాలని చెప్పారు. మండల సర్వేయర్ తులసీధర్, వీఆర్వో సురేష్ తదితరులు పాల్గొన్నారు.

మహాభారత ఉత్సవాలు ప్రారంభం

పాలసముద్రం, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): ఎస్ఆర్ఆర్ కండ్రిగలోని ద్రౌపదీ సమేత ధర్మరాజుల ఆలయంలో శుక్రవారం మహాభారత ఉత్సవాలను ప్రారంభించారు. ఈనెల పదో తేదీ వరకు ఉత్సవాలు జరుగుతాయని ధర్మకర్త మురళీనాయుడు తెలిపారు. పగలు భాగవతారిణి అనసూయ హరికథ, రాత్రి వెంకటేశ్వర కళానాట్య మండలి బృందం వీధి నాటకాలు ఉంటాయన్నారు.

ఆడిమాస ఉత్సవాలు

నగరి, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): ఓంశక్తి ఆలయంలో శుక్రవారం ఆడిమాస ఉత్సవాలు నిర్వహించారు. అమ్మవారికి భక్తులు అంబళ్లు సమర్పించారు.

పేదల అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం: ఎమ్మెల్యే థామస్


లబ్ధిదారుకు పింఛన్ సొమ్ము అందజేస్తున్న ఎమ్మెల్యే థామస్

పెనుమూరు, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): పేదల అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే థామస్ తెలిపారు. శుక్రవారం తూరుపల్లెలో కొత్త పింఛన్లను ఆయన పంపిణీ చేశారు. అలాగే సీఎం సహాయ నిధి నుంచి ముగ్గురికి రూ.10.85 లక్షలు మంజూరవగా, ఆ మొత్తాలకు సంబంధించిన చెక్కులను బాధితులకు అందజేశారు. అనంతరం ఇంటింటికీ వెళ్లి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. టీడీపీ మండల అధ్యక్షుడు రుద్రయ్యనాయుడు, నాయకులు చిరంజీవులురెడ్డి, తలారి రెడ్డెప్ప, భాస్కర్, ప్రసాద్, విశ్వనాథరెడ్డి, మనోహర్‌రెడ్డి కృష్ణమూర్తి నాయుడు, సతీష్‌రెడ్డి, రాజేష్‌రెడ్డి అమర్‌నాథ్, యుగంధర్, అశోక్, హరి, చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

వరసిద్ధుడి సేవలో ఎమ్మెల్యే


ఎమ్మెల్యే మురళీమోహన్‌కు జ్ఞాపిక అందిస్తున్న ఈవో పెంచలకిషోర్

ఐరాల(కాణిపాకం), ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ పుణ్యక్షేత్రమైన కాణిపాకంలో శుక్రవారం పూతలపట్టు ఎమ్మెల్యే మురళీమోహన్ జన్మదిన వేడులను నాయకులు, కార్యకర్తలు ఘనంగా నిర్వహించారు. ఉదయం ఆయన్ను ఈవో పెంచలకిషోర్ ఆలయ మర్యాదలతో ఆహ్వానించి స్వామి దర్శన ఏర్పాట్లు చేశారు. అనంతరం ఆలయం వెలుపల బస్టాండ్ సర్కిల్‌లో అభిమానుల ఆధ్వర్యంలో కేక్‌ను కట్‌చేశారు. టీడీపీ మండల అధ్యక్షుడు గంగారపు హరిబాబు నాయుడు, నియోజకవర్గ పోల్ మేనేజ్‌మెంట్ కన్వీనర్ వడ్లపాటి గిరిధర్‌బాబు, సింగిల్‌విండో అధ్యక్షుడు శేషాద్రి నాయుడు, మాజీ సర్పంచ్ మధుసూదనరావు, ఆలయ మాజీ చైర్మన్ మణినాయుడు, మాజీ జడ్పీటీసీ లత, పూర్ణచంద్రరావు, ఎంఎస్ చౌదరి, ఆలయ ప్రధాన అర్చకుడు సోమశేఖర్ గురుకుల్ పాల్గొన్నారు.

సంక్షిప్తంగా..

అంకాల పరమేశ్వరికి పూజలు



చిత్తూరు కల్చరల్, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): గుర్రప్ప నాయుడు వీధిలోని అంకాల పరమేశ్వరి అమ్మవారికి మూడో ఆడిమాస మూడో శుక్రవార పూజలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అలాగే గిరింపేట దుర్గాంబ, తేనెబండ ముత్యాలమ్మ, కామాక్షి అంబికా సమేత అగస్త్యేశ్వర తదితర ఆలయాల్లోనూ పూజలు జరిగాయి.

సత్తెమ్మ ఊరేగింపు



చిత్తూరు కల్చరల్, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): మురకంబట్టులోని గ్రామదేవత సత్తెమ్మ జాతరను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. అమ్మవారిని ప్రత్యేక రథంలో అధిష్ఠింపజేసి ఊరేగించారు.

విద్యాసామగ్రి వితరణ



వెదురుకుప్పం, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): కార్వేటినగరం మండలం తుంగమిట్ట మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు శుక్రవారం అక్కడ పనిచేసే ఏకోపాధ్యాయుడు కె.బొబ్బిలిరెడ్డి తన పుట్టిన రోజును పురస్కరించుకుని తెలుగు, ఇంగ్లీషు కాపీ రైటింగ్ పుస్తకాలతోపాటు పెన్నులు, పెన్సిళ్లను వితరణ చేశారు.

నగరి ఎమ్మెల్యేకు స్వాగతం



పూతలపట్టు, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): పూతలపట్టు ఎమ్మెల్యే మురళీమోహన్ తన జన్మదిన వేడుకలను బంగారుపాళ్యం మార్కెట్ యార్డులో టీడీపీ నాయకులు, కార్యకర్తల నడుమ శుక్రవారం జరుపుకున్నారు. ఈ కార్యక్రమానికి నగరి ఎమ్మెల్యే భానుప్రకాష్ విచ్చేయగా.. చిత్తూరు పార్లమెంటు అధికార ప్రతినిధి గంగారపు గోపి, ఎల్బీఐ అధినేత, టీడీపీ నేత లోకేష్ రెడ్డి, పూతలపట్టు సింగిల్ విండో చైర్మన్ జగన్నాథం, టీడీపీ నేతలు మధు, రామమూర్తి నాయుడు, కృష్ణమూర్తి, రెడ్డెప్పరెడ్డి, నరసింహులు తదితరులు స్వాగతం పలికారు.

ఏఎంసీ డైరెక్టర్‌కు సన్మానం



పూతలపట్టు, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): బంగారుపాళ్యం వ్యవసాయ మార్కెట్ కమిటీ (ఏఎంసీ) డైరెక్టర్‌గా పూతలపట్టు మండలం పాలకూరుకు చెందిన గురుస్వామి శుక్రవారం ప్రమాణస్వీకారం చేశారు. ఈ సందర్భంగా పాలకూరు గ్రామస్తులు సన్మానించారు.

ద్రౌపదమ్మకు పూజలు

వెదురుకుప్పం, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): కార్వేటినగరంలోని ద్రౌపది సమేత ధర్మరాజుల దేవస్థానంలో శుక్రవారం అమ్మవారికి విశేష పూజలు చేశారు. అనంతరం అమ్మవారిని సుందరంగా అలంకరించి భక్తులను దర్శనానికి అనుమతించారు. ఏర్పాట్లను ఆలయ కమిటీ అధ్యక్షుడు మేశం రవియాదవ్ పర్యవేక్షించారు.

4 నుంచి గంగమ్మ జాతర

పూతలపట్టు, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): చౌడేపల్లె గ్రామంలోని ధనుమకొండ గంగమ్మ జాతర ఈనెల నాల్గవ తేదీనుంచి రెండ్రోజుల పాటు జరగనుంది. ఈమేరకు కార్యనిర్వాహకులు ఒక ప్రకటనలో తెలిపారు. 4న రాత్రి పొలకల సంతగేటులో ప్రారంభమయ్యే అమ్మవారి పుష్పపల్లకి 5వ తేదీ ఉదయం ఆలయం వద్దకు చేరుకుంటుందన్నారు. అనంతరం ఆలయం వద్ద అమ్మవారికి పూజలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

కామన్ సీనియారిటీ ప్రకారం టీచర్ పోస్టులు భర్తీ చేయాలి: ఫ్యాప్టో

విజయపురం, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): కామన్ సీనియారిటీ ప్రకారం టీచర్ పోస్టులు భర్తీ చేయాలని ఫ్యాప్టో నాయకులు డిమాండ్ చేశారు. పన్నూరు, విజయపురం, జీఎంపురం, జంబాడ, శ్రీహరిపురంలో మధ్యాహ్న భోజన విరామ సమయంలో శుక్రవారం నిరసన తెలిపారు. కోర్టు కేసును సాకు చూపుతూ ఏకపక్ష నిర్ణయాలు తీసుకోవద్దని కోరారు. కొత్తగా చేరిన వారికి పొజిషన్ ఐడీ క్రియేట్ చేసి జీతాలు చెల్లించాలన్నారు.

చంద్రబాబు పాలనలోనే రాష్ట్రాభివృద్ధి : టీడీపీ


పోతురాజులు కండ్రిగలో కరపత్రాలు పంచుతున్న టీడీపీ నాయకులు

విజయపురం, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): చంద్రబాబు పాలనలోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని టీడీపీ నాయకులు అన్నారు. శుక్రవారం పోతురాజులు కండ్రిగలో 'సుపరిపాలనలో తొలిఅడుగు' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఏడాది ప్రభుత్వ పాలనపై ఇంటింటికీ వెళ్లి కరపత్రాలు పంపిణీ చేశారు. టీడీపీ మండల అధ్యక్షుడు రమేష్‌రాజు, తెలుగు యువత ప్రధాన కార్యదర్శి దేవేంద్ర నాయుడు, బూత్ కమిటీ అధ్యక్షుడు వెంకటాచలం, ఉపాధ్యక్షుడు బాబు, కార్యదర్శి హరిబాబు, మునస్వామి, యూనిట్ ఇన్‌చార్జి మురళీనాయుడు, మండల కోకన్వీనర్లు బాబు, లక్ష్మయ్య, కపిల్ తదితరులు పాల్గొన్నారు.

జన్మదిన శుభాకాంక్షలు


మురళీమోహన్‌కు కేక్ తినిపిస్తున్న ఎమ్మెల్యే థామస్

వెదురుకుప్పం, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): పూతలపట్టు ఎమ్మెల్యే మురళీమోహన్‌ను చిత్తూరులోని ఆయన కార్యాలయంలో జీడీనెల్లూరు ఎమ్మెల్యే థామస్ శుక్రవారం కలిసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. నియోజకవర్గ నేతలు పాల్గొన్నారు.

'బోధనేతర పనుల నుంచి టీచర్లను మినహాయించాలి'

నగరి, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): బోధనేతర పనుల నుంచి టీచర్లను మినహాయించాలని ఫ్యాప్టో నగరి డివిజన్‌శాఖ డిమాండ్ చేసింది. ఈ మేరకు నగరిలో నిరసన తెలిపారు. నాయకులు మణిగండన్, మునిరత్నం, వంశీకృష్ణ, లక్ష్మీనారాయణ, నాగభూషణం, యువరాజ్, రూబన్, ప్రకాష్, సంతోష్‌కుమార్, హరీష్, సురేష్‌బాబు, జనార్దన్, గణేష్ మోహన్, టీచర్లు పాల్గొన్నారు.

గర్భవతిని చేసి పరారయ్యాడు: మహిళ ఆరోపణ

శ్రీరంగరాజపురం, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): తనను గర్భవతిని చేసి పరారయ్యాడని లక్ష్మి ఆరోపించారు. శుక్రవారం ఆమె మీడియాకు వివరాలు తెలిపారు. మెదవాడ ఎస్టీ కాలనీ చెందిన లక్ష్మికి భర్త మృతిచెందడంతో గంగాధరనెల్లూరు మండలం కేనాసంపల్లెలోని పుట్టింటికి వెళ్లింది. ఈ గ్రామానికి సమీపంలోని సర్వేరెడ్డిపల్లెకు చెందిన తాపీమేస్త్రి బాలకృష్ణారెడ్డితో ఏర్పడిన పరిచయం సహజీవనానికి దారితీసింది. ఎనిమిది నెలల గర్భవతి కావడంతో పెళ్లి చేసుకోవాలని బాలకృష్ణారెడ్డిని అడిగితే డబ్బు లేదని చెప్పాడు. దాంతో రూ.85వేలను వేరొకరి నుంచి లక్ష్మి అప్పుగా తీసిచ్చింది. ఆ డబ్బును తీసుకుని బాలకృష్ణారెడ్డి బెంగళూరుకు పరారయ్యాడని బాధితురాలు ఆరోపిస్తున్నారు. దీనిపై గంగాధర నెల్లూరు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తే వారు పట్టించుకోలేదని తెలిపారు. ఇపుడు ఎస్ఆర్‌పురం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశానని, తనకు న్యాయం చేయాలని కోరుతున్నారు. దీనిపై ఎస్ఐ సుమన్‌ను వివరణ కోరగా.. బాధితురాలు ఫిర్యాదు చేశారని, విచారిస్తున్నామని తెలిపారు.

12నుంచి నులిపురుగుల నిర్మూలన మాత్రల పంపిణీ

చిత్తూరు కలెక్టరేట్, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): జాతీయ నులిపురుగుల నిర్మూలన కార్యక్రమ పోస్టర్‌ను శుక్రవారం కలెక్టరేట్‌లోని మీటింగ్ హాలులో కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆవిష్కరించారు. 1-18 ఏళ్ల మధ్య ఉన్న పిల్లలకు నులిపురుగుల నిర్మూలన మాత్రల పంపిణీ కార్యక్రమం ఈనెల 12వ తేదీ నుంచి ప్రారంభమౌతుందని కలెక్టర్ తెలిపారు. డీఎంహెచ్‌వో సుధారాణి, ఆర్బీఎస్‌కే నోడల్ ఆఫీసర్ గిరి, సిబ్బంది పాల్గొన్నారు.

నాగాలమ్మ జాతర

చిత్తూరు కల్చరల్, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): నగరంలోని సంతపేట ఇందిరానగర్‌లో నాగాలమ్మ జాతర శుక్రవారం నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే సీకే బాబు పూజలు చేశారు. టీవీ శ్రీనివాసులు, గణేశ్ రెడ్డి పాల్గొన్నారు.

'ఆటోమ్యుటేషన్'పై పరిశీలన


అధికారులతో మాట్లాడుతున్న కమిషనర్ నరసింహప్రసాద్

చిత్తూరు అర్బన్, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ఈనెల ఒకటో తేదీనుంచి ప్రతిష్ఠాత్మకంగా ప్రారంభించిన ఆటో మ్యుటేషన్ విధానాన్ని గిరింపేటలోని జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయంలో జిల్లా రిజిస్ట్రార్ మూర్తి, కమిషనర్ నరసింహమూర్తి, సహాయ కమిషనర్ ప్రసాద్ శుక్రవారం పరిశీలించారు. ప్రభుత్వం జారీ చేసిన మార్గదర్శకాలకు అనుగుణంగా ఆటో మ్యుటేషన్‌ను పూర్తి చేయాలని ఆదేశించారు. ఆర్వో గోపాలకృష్ణ వర్మ, ఆర్ఐలు, సబ్ రిజిస్ట్రార్లు, ఆపరేటర్లు పాల్గొన్నారు.

కాన్పులు సీహెచ్‌సీలోనే చేయాలి: డీసీహెచ్ఎస్


సీహెచ్‌సీని పరిశీలిస్తున్న పద్మాంజలి

పెనుమూరు, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): కాన్పులను సీహెచ్‌సీలోనే చేయాలని డీసీహెచ్ఎస్ పద్మాంజలి ఆదేశించారు. శుక్రవారం పెనుమూరు సీహెచ్‌సీని తనిఖీ చేశారు. అక్కడున్న రోగులతో మాట్లాడి వైద్యసేవలను ఆరా తీశారు. నూతనంగా నిర్మిస్తున్న భవనాన్ని పరిశీలించారు. ఈకార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్ శ్రీధర్, డాక్టర్ సంతోష్, హెడ్‌నర్సు నిర్మల పాల్గొన్నారు.

వైభవంగా 'అర్జున తపస్సు'

యాదమరి, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): దాసరాపల్లె దళితవాడలో జరుగుతున్న రేణుకా ఎల్లమ్మతల్లి జాతరలో భాగంగా శుక్రవారం అర్జున తపస్సు కార్యక్రమం వైభవంగా జరిగింది. అర్జున వేషధారి పద్యాలు పాడుతూ తపస్సుమానును అధిరోహించారు. అర్జున వేషధారి విసిరిన విభూది, నిమ్మకాయల కోసం భక్తులు పోటీపడ్డారు.

ద్రౌపదమ్మ తిరునాళ్ల


ద్రౌపది, ధర్మరాజుల విగ్రహాల ఊరేగింపు

ఐరాల(కాణిపాకం), ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): కాణిపాకానికి సమీపంలోని వినాయకపురంలో ద్రౌపదమ్మ తిరునాళ్లను శుక్రవారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ద్రౌపదీ సమేత ధర్మరాజుల విగ్రహాలను ఊరేగించారు. నిర్వాహకులు గెరిగ, నయాండీ నృత్యాలను ఏర్పాటు చేశారు.

ఆర్‌బీఎస్ రాష్ట్ర కోఆర్డినేటర్‌గా రామభద్ర


నియామక పత్రం అందుకుంటున్న రామభద్ర

చిత్తూరుకల్చరల్, ఆగస్టు1 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రీయ బ్రాహ్మణ సంఘటన్ (ఆర్‌బీఎస్) రాష్ట్ర కోఆర్డినేటర్‌గా చిత్తూరువాసి రామభద్ర నియమితులయ్యారు. ఇటీవల విజయవాడలో నిర్వహించిన సమావేశాల్లో రాష్ట్ర మాజీ కార్యదర్శి వేమూరి సూర్యనారాయణ నుంచి నియామకం పత్రం అందుకున్నారు.

కలెక్టర్‌ను కలిసిన జైళ్లశాఖ ఏఎస్పీ



చిత్తూరు కలెక్టరేట్, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): చిత్తూరు జిల్లా జైళ్ల శాఖ ఏఎస్పీ కె.వెంకటరెడ్డి శుక్రవారం కలెక్టర్ సుమిత్‌కుమార్‌ను కలెక్టరేట్‌లోని ఆయన చాంబర్‌లో మర్యాదపూర్వకంగా కలిసారు. ఈ సందర్భంగా కలెక్టర్‌కు మొక్కను బహూకరించారు.

వైసీపీ సోషల్ మీడియా వింగ్ జాయింట్ సెక్రటరీ నియామకం

బంగారుపాళ్యం, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): బంగారుపాళ్యం మండలానికి చెందిన కిషోర్ కుమార్‌రెడ్డిని వైసీపీ సోషల్ మీడియా వింగ్ రాష్ట్ర జాయింట్ సెక్రటరీగా అధిష్ఠానం నియమించింది.

ఎమ్మెల్యే మురళీమోహన్ జన్మదిన వేడుకలు


ఎమ్మెల్యే మురళీమోహన్‌కు కేకు తినిపిస్తున్న నాయకులు

బంగారుపాళ్యం, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): పూతలపట్టు ఎమ్మెల్యే కలికిరి మురళీమోహన్ జన్మదిన వేడుకలు బంగారుపాళ్యం మార్కెట్ యార్డులో ఎమ్మెల్యేలు, నాయకులు, కార్యకర్తలు నడుమ శుక్రవారం ఘనంగా జరిగాయి. అభిమానులు ఏర్పాటు చేసిన భారీ కేక్‌ను కట్ చేసి పంచిపెట్టారు. ఎమ్మెల్యేకి శుభాకాంక్షలు తెలిపిన వారిలో నగరి, చంద్రగిరి ఎమ్మెల్యేలు గాలి భానుప్రకాష్, పులివర్తి నాని,మాజీ ఎమ్మెల్సీ దొరబాబు, బంగారుపాళ్యం టీడీపీ అధ్యక్షుడు ధరణీప్రసాద్, గౌరవాధ్యక్షుడు జయప్రకాష్, మాజీ ఏఎంసీ చైర్మన్ జయచంద్రనాయుడు, నాయకులు ఎస్పీ సురేంద్రనాయుడు, ఎస్పీ శ్రీనివాసులునాయుడు, ఎస్పీ నవీన్, కోదండయాదవ్, ఎస్పీ విక్రమ్, జనార్ధన్ గౌడ్, కేకా ప్రకాష్‌నాయుడు, బీజేపీ జిల్లా అధ్యక్షుడు జగదీష్, అమరనాథనాయుడు, రమేష్, టీకే హరిప్రసాద్, సూరి, రాధాకృష్ణమనాయుడు, చిన్నెయ్య, బాలసుబ్రహ్మణ్యం, లోకనాథనాయుడు, కమలనాథరెడ్డి, బీసీ రవీంద్రనాయుడు, జి.రవీంద్రనాయుడు, గజపతి, మంజునాథ్, మాధవనాయుడు, మోహన్‌నాయుడు, బాలకృష్ణమనాయుడు, సూరినాయుడు, కొండేటి శివ, నియోజకవర్గంలోని టీడీపీ మండల అధ్యక్షులు ఉన్నారు.